ఏప్రిల్ - 2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పుత్సనేహు | కొడవటికంటి | 03 |
| దున్నపోతుమీదవర్షం | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 07 |
| మరియ | హన్నాకృప డెస్క్ | 09 |
| సిలువ మరణం | హన్నాకృప డెస్క్ | 11 |
| దేవుని కొరకు | సాక్ష్యం | 12 |
| ఈసా బర్ అబ్బ | ఎ.యస్.ఆర్.జక్కం | 14 |
| విలువైనది | చిన్నపిల్లల పేజి | 17 |
| కృపాదానం | కొడవటికంటి | 19 |
| నమ్మితే సమస్తము... | హన్నాకృప డెస్క్ | 21 |
| దేవుడు - సిరి | హన్నాకృప డెస్క్ | 22 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పట్టిక-9 | | 24 |



**గౌరవ సంపాదకులు :**

**కె. సామ్యేల్ రాజేంద్ర**

**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-




**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726




**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


సీరియల్ నంబరు



# సంపాదకీయం.....

హన్నాకృప పాఠకులకు గుడ్‌ఫ్రైడే మరియు ఈస్టరు శుభాకాంక్షలు.

ప్రభువైన యేసుక్రీస్తు మన పాపముల కొరకు చనిపోయి తిరిగి లేచి ఇప్పటికి 2000 సంవత్సరాలు దాటింది. అప్పటి నుండి మానవాళి ఆ సంఘటనను జ్ఞాపకం చేసుకుంటూ ఈస్టరు పండుగ సంబరాలు జరుపు కుంటున్నారు. అది చాలా ఆనందించదగ్గ విషయమైనప్పటికీ, క్రీస్తు మన కోసం చనిపోయిన ఉద్దేశాన్ని విస్మరించి ఈస్టరు పండుగరోజు విందులు, వినోదాలతో తాగి తందనాలు ఆడటం సర్వత్రా పరిపాటి అయింది. ఇది చాలా విచారించ దగ్గ విషయం. ఎందుకంటే, యేసు చనిపోయి తిరిగి లేచింది, పాపభూయిష్టమైన ఈ లోకం నుండి మనకు పరలోకరాజ్యము ప్రాప్తింప జేయటానికి. అయితే అందుకు మనం అర్హత కలిగి ఉన్నామా లేదా అని మనల్ని మనం పరీక్షించుకోవాలి. పాపులమైన నా కొరకు, నీ కొరకు ఆయన తన ప్రాణాన్ని బలిగా అర్పించినందుకు కృతజ్ఞతగా మన ఆయన కొరకు ఏమి చేస్తున్నామో ఒక్కసారి ఆలోచించుకోవాలి. క్రీస్తుని ఎరుగని వారికి ఆయన యొక్క ప్రేమను, ఆయన చేసిన త్యాగాన్ని చాటి చెప్పడం మనందరి బాధ్యత. యేసు చనిపోయి తిరిగి లేచాడని సంతోషించడంలో తప్పు లేదు. ఆయన ఎందుకు చనిపోయాడో ఆ సంకల్పాన్ని మనం నేర్చడం మన బాధ్యత. ఈ బాధ్యతను సక్రమంగా నెరవేర్చడమే మనం ఆయన పట్ల చూపించే కృతజ్ఞత. అలా కాకుండా మనం తిని, త్రాగడానికి, ఆడటానికి యేసు చావుని అడ్డం పెట్టుకోవడం పాపమే. కాబట్టి యేసు ఏ కారణాన్నిబట్టి చనిపోయాడో ఆ ఉద్దేశ్యాన్ని నెరవేర్చాలంటే , సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించాలి. ఇదే ప్రతి క్రైస్తవుని నుండి దేవుడు కోరుకుంటున్నాడు. ఈ ఈస్టరు శుభపర్వదినాన దేవుని కృప మీ అందరికి తోడైయుండును గాక!

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరు చున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును. మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్



# జఫ్నత్పనేహు

(యోసేపు జీవితచరిత్ర)

- కొడవటికంటి

"యోసేపు! ఈ గాజా పట్టణం చూడడానికి ఎంత అందమైనదో అంత భయంకరమైనది. భూమి మీద నలుమూలల నుండి వచ్చే వ్యాపారస్తుల కొరకు పాపం కూర్చబడి ఉంటుంది. ఆ వీధి వేశ్యల వీధి. అందులో ఒక్కసారి నడచినా కూడా ఆ వీధి జ్ఞాపకాలు మనల్ని వదిలి పెట్టవు. మనలాంటి యువకులు ఐగుప్తులో సంపాందించిన ధనమంతా ఈ గాజాలో క్రుమ్మరించి, వ్యభిచారంతో, భోగములతో ధనం వ్యయం చేసుకొని వట్టి చేతులతో తమ స్వంత పట్టణాలకు వెళ్ళలేక, ఐగుప్తుకు తిరిగి వెళ్ళి బానిసలుగా అమ్ముడైపోయారు" అన్నాడు వియాన్.

"వేశ్యలంటె ఎవరు?" అని అడిగాడు యోసేపు.

"అదీ... అదీ.. ఇప్పుడు నీకు అర్థం కాదులే. ఐగుప్తు వెళ్తున్నాము కదా! నిన్ను సామాన్య మానవులకు మన యూషను అమ్మడు. యూషను చాలా పలుకుబడి కలవాడు. ఐగుప్తులో ఫరో సేవకులలో చాలా గొప్పవారు యూషను స్నేహితులే. బహుశా వారిలో ఎవరికైనా నిన్ను అమ్మివేస్తాడు. యూషనుకి నువ్వంటే చాలా ప్రేమ ఉంది. పైకి కనిపించడు కాని అతని హృదయం చాలా జాలిగలది. తన దగ్గర ఉన్న బానిసలను కూడా ప్రేమగా చూస్తాడు" చెప్పాడు వియాన్.

ఇంతలో ఊరి గవిని యొద్దకు వచ్చారు. ఆ గవిని యొద్ద పట్టణపు తలుపులు చాలా పెద్దవి. వాటి ద్వారబంధ ములు విచిత్రమైన నగిషీ పని చేయబడియున్నవి. వాటికి రెండు లావైన అడ్డగడియలు, ద్వారబంధములకు రాత్రివేళ బిగించుటకు వీలున్నది. యోసేపుకు ఒక ఆలోచన వచ్చింది. తన యజమానుడు గాజా పట్టణం దాటివెళ్ళవద్దన్నాడు. అందువల్లనే తూర్పున ఉండే హెబ్రోను కొండవరకైనా తను వెళ్ళలేదు. ఈ గాజా పట్టణం యొక్క తలుపులు వాటి ద్వారబంధాలతో, గడియలతో కూడా హెబ్రోను కొండ మీద ఉంటే తను అక్కడ దాకా వెళ్ళి వచ్చిన – ఆజ్ఞ అతిక్రమము కాదు గదా! అని అనుకుంటూ ఆ ఆలోచన వచ్చినందుకు నవ్వుకున్నాడు. వియాన్ అడిగాడు "మళ్ళీ నవ్వుతున్నావ్ ఎందుకు?" అని. తన మనసులోని ఆలోచన చెపితే వియాన్ నవ్వి "ఏమో, నీ మనసులోని ఆలోచన ముందుకు నెరవేరుతుందేమోలే. నువ్వు చెప్పినట్లు ఆ నెఫీలులలో ఎవరైనా పదిమూరల ఎత్తుండే వీరుడు ఎవడైనా పుట్టి, ఫిలిష్తీయుల మీద కోపంతో ఆ అడ్డ గడియలు తలుపులు ఎత్తుకొని వెళ్ళి మీ హెబ్రోను కొండ మీద పడవేస్తాడేమోలే, వెళ్దామా?" అంటూ తన నివాసం వైపు నడక సాగించాడు.

ఉదయం మరలా ప్రయాణం మొదలైంది. ఈసారి యోసేపు వియాన్‌తో ఉండి సామాను ఒంటెల మీదకు ఎత్తించటం, భోజనం తయారు చేయించటం, పనివాళ్ళ అవసరతలు కనుక్కోవటం బానిసల వంతులు వేయటం, వారిని దయగా చూడడం ప్రారంభించాడు. గాజా నుండి ఐగుప్తు పొలిమేరలు చేరటానికి నూటపాతిక మైళ్ళు ప్రయాణం చెయ్యాలి. ప్రయాణం అంతా ఎడారి ప్రదేశము. షూరు అరణ్యం అంటారు. దారి దోపిడీలు ఎక్కువగా జరుగుతుంటాయి. కనుక ప్రతి ఘటనకు యువకులంతా సిద్ధంగా ఉండాలి. ఈ ప్రదేశాలలో గెషూరీయులు, గెజరీయులు, అమాలేకీయులు కాపురముంటారు.

ఇంతకుముందు సముద్రతీరం వెంబడి చేసిన ప్రయా ణం దీనికి పూర్తిగా వ్యతిరేకం. గుంపులో అందరూ ఆయు ధాలు ధరించారు. గుంపుకు వెనుక ముందు కూడా పూర్తి భద్రత కల్పించబడింది. వియాన్ పూర్తి సైనికుని దుస్తులు ధరించాడు. అన్ని రకాల యుద్ధాయుధాలు ధరించాడు. ఇంతకుముందు ఇటువంటి ప్రయాణంలోనే జరిగిన

పోరులో వియాన్‌కు కొద్దిగా గాయాలు తగిలిన, ఇద్దరు బందిపోటులను చంపేశాడు. అప్పటినుండి తనంటే బానిసలలో మంచి గౌరవం ఉంది. అతన్ని చూస్తే వారికి ధైర్యం వస్తుంది. ఇంకా రెండు మజిలీలు చేస్తే ప్రయాణంలో ఇబ్బందులు తొలగినట్లే. ముఖ్యంగా ఇసుక తుఫానులను తరచూ ఎదుర్కొనవలసి వస్తుంది. ఇసుక తుఫానులు వచ్చినప్పుడు ఎంత ధీరుడైనా ఏమి చెయ్యలేడు. అంతా దేవునిదే భారము అని అనుకోవాల్సిందే తప్ప!

గాజా దాటి గంట ప్రయాణం తర్వాత ప్రయాణం చాలా నెమ్మదిగా సాగింది. ఇసుక ఎడారిని చూడటం ఇదే ప్రథమం. యోసేపుకు ఇసుకలో నడక కుదర్లేదు. ఇరవై మైళ్ళు నడచిన తర్వాత ఒక చిన్న ఊరు వచ్చింది. అంతా కలిసి నలభై, యాభై ఇళ్ళు ఉంటాయి. ఖర్జూరపు చెట్లు విస్తారంగా ఉన్నాయి. వాటి మధ్యలో దూరంగా చిన్న గుడిశెలు మాత్రం ఉన్నాయి. ఆ గ్రామం పేరు 'గెదెలా'. పుట్టిన తర్వాత తను ఎన్నడూ రెండు మూడు మైళ్ళ కంటే ఎక్కువ నడవలేదు. మొదటిసారి ఇంతదూరం నడిచినందువల్ల కాళ్ళు, నడుము ఎంతో నొప్పిగా ఉన్నాయి చేతులు పాదాలు బాగా వాచాయి. ఆ రాత్రి భోజనాలు ముగించుకొని పెందలకడనే ఇసుకలో సామాను మధ్యలో పండుకొన్నాడు. తెల్లవారుజామున నిద్రలేచేటప్పటికి ఒల్లంతా ఇసుకే. నీళ్ళు సర్ది వాడుకోవాలి. స్నానాలు చేయకూడదు. ముఖాలు కడుగకూడదు. ఇంకా రెండ్రోజుల వరకు ఎవ్వరూ ముఖాలు కడుగరు. గెదెలా దగ్గర నీళ్ళు ఉన్నాయి. కాని ఇష్టంగా త్రాగటానికి పనికిరావు. ఎక్కువ చేదు కాకపోయినా వాడుకోటానికి పనికిరావు. అక్కడ నివసించే వాళ్ళుకూడా – నీళ్ళను గాజా నుండి తోలుతిత్తులతో తెచ్చుకుంటుంటారు.

రెండవరోజు వియాన్ ఒక ఒంటె సవారి ఏర్పాటు చేశాడు. అందువల్ల వియాన్, యోసేపు ఒంటె మీద కూర్చుని ప్రయాణం మొదలు పెట్టారు. ఇప్పుడు కనాను, పాలస్తీనా వాగ్దాన భూమి దాటి ఐగుప్తు తట్టుగా దారి మరల్చబడింది. ఉదయం పూట చాలా చల్లగా ఉంటుంది. కానీ మధ్యాహ్నం నుండి రాత్రి పది గంటల వరకు వేడి గాలులు వీస్తూ ఉంటాయి. ముఖం కూడా కనబడకుండా గుడ్డతో కప్పుకోవాల్సి వస్తుంది. నడిజాము తర్వాత గాలి చాలా వేగంగా వీస్తూ ఉంటుంది. ఒంటెలు ఆ గాలికి ఎదురు నడువవలసి వచ్చినప్పుడు మెడ బాగా ముందుకు చాచి భారంగా నడుస్తాయి. ప్రతి అడుగు ఒక భారమైన నిట్టూర్పు ద్వారా తెలుపుతాయి. అయినా సాగిపోవలసిందే! విసుక్కున్నట్లుగా, అరచినట్లుగా శబ్ధాలు చేస్తుంటాయి. కాని ఏనాడు పని చెయ్యం అని ఎదిరించవు. వియాన్ మెడలో గొలుసుకి ఒక బొమ్మ ఉంది. “ఇది ఏమిటి?” అని అడిగాడు యోసేపు.

“రిమ్మోను” చెప్పాడు వియాన్. “అంటే?” అడిగాడు యోసేపు.“మా దేవత ” అని “మీకు దేవుడు లేడా?” అడిగాడు వియాన్. ‘‘ఇప్పుడు మనం ఏ దేశంలో ఉన్నాము?” అడిగాడు యోసేపు. “షూరు అరణ్యం అంటే ఎడారి. ఇది కొంతకాలం ఐగుప్తు ఏలుబడిలోను, కొంతకాలం ఫిలిష్తీయుల ఏలుబడి లోను ఉంటుంది. ఇప్పుడు దీనిని ఐగుప్తు పరిపాలిస్తుంది” చెప్పాడు వియాన్. “ఔను..! నిన్న మీ దేవుణ్ణి గురించి సముద్రం దగ్గర చాలా మాట్లాడావు కదా! నువ్వు చెప్పినవాడు దేవతా? దేవుడా? సముద్రాన్ని చేశాడు,చేపలు చేశాడు అన్నావు, ఆయన పేరేంటి?” అడిగాడు వియాన్. యోసేపు కొంచెంసేపు ఆలోచించాడు. ఏమో! నాకు కూడా పూర్తిగా తెలియదు. మా తాత , తండ్రి ఎప్పుడైనా సందర్భానుసారంగా దేవుని సంగతులు మాట్లాడుతుండేవారు. నేను వినటమే కాని ఎప్పుడూ ఆలోచించలేదు” అని కొంచెంసేపు ఆలోచించాడు. ఒంటె నిదానంగా నడుస్తున్నందువల్ల పెద్దగా కుదుపులు లేవు. ఒంటెలు వేగంగా నడిచేటప్పుడు పైన కూర్చున్నవాడు వేగం కొద్దీ ఉయ్యాల ఊగుతున్నట్లుండి మాట్లాడుకోవటానికి వీలుకాదు.

“నేను బేతేలు వచ్చిందాకా అసలు దేవుని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. బేతేలులో కలిగిన అనుభవం నాలో దేవుని గురించిన ఆలోచనలకు ఒక రూపం కల్పించినట్లుగా అనిపించింది” అని ఆగాడు యోసేపు. వియాన్ తలెత్తి చూశాడు ఆపావెందుకన్నట్లు. “బేతేలులో మీ దేవునికి

గుడి ఉందా?" అని అడిగాడు. "అసలు మా దేవునికి గుడులు లేవు. మేము విగ్రహాలను పెట్టుకోము" చెప్పాడు యోసేపు. వియాన్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయి "అదేంటి! విగ్రహం లేని దేవుడు కూడా ఉంటాడా? శరీరం లేని మనిషి ఉంటాడా?" అన్నాడు. "ఔను, మా దేవునికి స్వరూపం లేదు. అవన్నీ మానవుని ఊహలు, దేవుడంటే దేవుడే. దేవుడంటే మానవుని వంటివాడు కాడు. దేవుడంటే మనకు కనిపించనివాడు, మనం చూడలేనివాడు అని అర్థం" చెప్పాడు యోసేపు. మనం చూడని వాటిని మనం ఎలా నమ్మగలం? దేవుడి బొమ్మ లేకుండా దేవుడు ఉన్నాడని ఎలా అనుకుంటావు? నిన్ను నేను చూడకుండానే యోసేపు ఉన్నాడని ఎలా నమ్ముతాను?" అన్నాడు వియాన్ "నువ్వు మాట్లాడేది మనిషి గురించా? దేవుని గురించా? మనిషికి, దేవునికి పోలిక ఏముంది? మనుష్యులు మర్త్యులు అంటే చనిపోయేవారు. దేవునికి చావు లేదు, పుట్టుకలేదు. ఆడకాదు, మగకాదు. దేవతాకాదు.." అంటూ ఆగి "దేవుడంటే ఏమిటో ఎవరికీ తెలీదు. తెలిసినా చెప్పలేరు. ఎందుకంటే దేవుని గురించి పూర్తిగా తెలియాలంటే దేవుడి దగ్గర నుండి ఎవరైనా మన దగ్గరకు రావాలి. అలా ఎవరూ రాలేదు. ఇకముందు వస్తారెమో తెలీదు. కనుక మనం దేవుని గురించి మాట్లాడడం అనవసరం. మనకు పూర్తిగా తెలియని వాటిని గురించి మనం ఎందుకు మాట్లాడాలి?" అన్నాడు యోసేపు. వియాన్ వింటున్నాడు. వింటూనే యోసేపు ముఖం చూస్తూ ఉన్నాడు. యోసేపు మాట్లాడడం ఆపి ఎటో చూస్తున్నాడు.

"బేతేలులో నువ్వు మీ దేవుని గురించి ఏదో తెలుసు కున్నాను అన్నావు కదా! ఏంటది అడిగాడు వియాన్. "అది నాకు తెలీదు. అంటే,చెప్పటం చేతకాదు. కానీ మా తండ్రి ముప్పై ఐదు సంవత్సరాల క్రితం అక్కడ – దేవుడ్ని, ఆయన దూతలను చూశాడట. దేవుడు మా తండ్రితో మాట్లాడాడట" చెప్పాడు యోసేపు. "ఏమి మాట్లాడాడు? ఆయన ఏ రూపంలో ఉన్నాడు?" ఆసక్తిగా అడిగాడు వియాన్.

"ఆయన రూపం మా తండ్రి చూడలేదు. ఆయన స్వరం మాత్రం విన్నాడు. ఆయన ఆకారం చూశాడు. అది మనుష్య ఆకారం కాదు. దైవాకారం! అది చూసిన వాళ్ళకే తెలుస్తుంది. చెప్పటానికి మానవభాష చాలదు. నాకు కూడా మా తండ్రి చెప్పినప్పుడు అర్థం కాలేదు. ఇప్పుడు నువ్వు నన్ను ఎలాగ అనుకుంటున్నావో, మా తండ్రి మొదటిసారి చెప్పినప్పుడు నేనూ అలాగే అనుకున్నాను. అయితే బేతేలులో నేను ఆయనను అనుభవించాను. అది వినటంకాదు, చూడటం కాదు. అది ఏదో..." అంటూ ఆగిపోయాడు యోసేపు. వియాన్ ఏమి మాట్లాడడంలేదు. ఏదో అర్థం కాని దాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లుగా, ఏది గమనించకుండానే అన్నీ చూస్తున్నట్లుగా, అంతా తెలుస్తున్నా ఏమి తెలియనట్లుగా ఉంది వియాన్‌కి. యోసేపు వియాన్ చేయి ప్రేమగా నిమిరాడు. వియాన్ – చల్లని పిల్లగాలి మృదువుగా మన దేహాన్ని స్పర్శించినపుడు కలిగే అనుభూతిని పొందాడు.

**(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra



# ‘దున్నపోతు మీద వర్షం’



వర్షం పడినప్పుడు ఏ మనిషైనా తడకుండా ఏ చెట్టు కిందకో, పంచలోకో పోతారు. జంతువులైతే వర్షం పడనట్టు గానే చలనం లేకుండా ఉంటాయి. మనం ఎవరికైనా ఏదైనా చెప్పి నప్పుడు వెంటనే స్పందించకపోతే ‘ఎంత చెప్పినా ఉలుకు పలుకు లేకుండా దున్నపోతు మీద వర్షం పడ్డట్టు ఉంటావేంటి’ అని అంటుంటాం. మనుష్యులకి జంతువులకి తేడా తెలియడానికి ఈ సామెత వాడతారు. ప్రస్తుతం బైబిలు చదివే విషయంలో ఈ సామెత వాడదాం. మీ జీవితకాలంలో బైబిలు గ్రంథం మొత్తం ఒక్కసారన్నా చదివారా? ఒకవేళ చదవకపోతే అందుకుగల కారణాలు ఏంటో చెప్పగలరా? ఈ రోజుల్లో బైబిలు ఒక అలంకారప్రాయంగానే మారింది. చర్చికి వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళడానికి తప్ప వ్యక్తిగతంగా చదవటానికి ఎవరూ ఉపయోగించటం లేదు. బైబిల్లో 66 పుస్తకాలుంటాయని చాలామందికి తెలియదు. దేవుడు ఇచ్చే వాగ్దానాల కోసం కీర్తనలు, యెషయా గ్రంథము తప్ప బైబిలు మొత్తం పూర్తిగా చదివేవాళ్ళే లేరు. *‘ఈ ధర్మశాస్త్రగ్రంథమును.. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు’ (యెహోషువ 1:8).* బైబిలును మనం దివారాత్రము ధ్యానిస్తే మనకే మంచిది తప్ప దేవునికి ఒరిగేదేమి లేదు. పరిశుద్ధ గ్రంథము నేడు మనకు అందుబాటులో మన ఇంట్లోనే ఉంటుంది. టి.వి.లో సినిమాలు, సీరియల్స్ చూడటానికి, స్కూల్, కాలేజీ చదువులకు సంబంధించి పుస్తకాలు చదవ డానికి చూపించే ఆసక్తి మన జీవితాలను మార్చివేసే జీవ గ్రంథానికి ఇవ్వటంలేదు. ఇంటర్నెట్‌లో వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వాడటానికి ఎంత సమయం కేటాయిస్తారో, మన జీవితానికి ఉపయోగపడని వాటికోసం సమయం ఎంత వృధా చేస్తున్నారో, ఆ వృధాచేసే సమయంలో కొంత బైబిలు గ్రంథం చదవడానికి కేటాయించలేకపోతున్నారంటే సాతానుకి ఎంతగా బంధీలుగా మారిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. మనుష్యులను బైబిలు చదవనీయకుండా దేవునికి దూరం చేయడానికి సాతాను పన్నిన కుట్రలో అందరూ చిక్కుకొని దిగ్విజయంగా సాతానుని గెలిపిస్తు న్నారు. ఆపకుండా బైబిలు చదివి పూర్తి చేయడానికి 72 గంటలు పడుతుంది (మూడురోజులు). ప్రతిరోజు 5 అధ్యాయాలు చదివితే సుమారు ఏడు నెలలు పడుతుంది. 5 అధ్యాయాలు చదవడానికి 30 నిమిషాలు పడుతుంది. దేవునికోసం ఆ మాత్రం సమయం కేటాయించలేరా? అనా రోగ్యంతో ఉన్నప్పుడో, కష్టకాలంలోనో బైబిలు చదవటం కాదు. ప్రతిరోజూ బైబిలు చదవడం అలవాటు చేసుకోవాలి. ఈ లోకముతో మనం బిజీగా ఉండి బైబిలు చదవడం బోరు కొడుతుందని, అర్థం కావడంలేదని, మర్చిపోతు న్నామని అనేకమైన కారణాలు చెప్పడం అర్థరహితం. రాబోవు రోజులలో దేవుని వాక్యము దొరకని కాలము వస్తుంది. అప్పుడు దేవుని వాక్యమును వెదకినా దొరకదు. మనఃస్ఫూర్తిగా బైబిలు పూర్తిగా చదవాలి అనుకుంటే దేవుడు తప్పక సహాయం చేస్తాడు. *‘యెహోవా గ్రంథమును పరిశీలించి చదువుకొనుడి’ (యెషయా 34:16)* అని దేవుడే స్వయంగా చెప్పినా వినకపోతే ఏమనుకోవాలి? వర్షం మనిషి మీద పడిందో, దున్నపోతు మీద వర్షం పడిందో ఎవరికి వారే డిసైడ్ చెయ్యాలి. **‘దున్నపోతు మీద వర్షం’** కాదు మనిషి మీదనే అనుకుంటే బైబిలు గ్రంథాన్ని పూర్తిగా (ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము) చదవడాన్ని ఒక సవాలుగా తీసుకుని నేడే చదవటం ప్రారంభించండి. దేవుడు మీకు తప్పక సహాయపడతాడు.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9440217726**

సీరియల్

6

# నా చిత్తానుసారుడు

– కొడవటికంటి

(దావీదు జీవిత చరిత్ర)

ఆ రాత్రి రాజప్రసాదంలోని తన గదిలో పండుకొన్నాడు. ఉదయం సౌలు దర్శనం చేసికొన్నప్పుడు ఇద్దరు పనివారు దావీదు దగ్గరకు వచ్చి సౌలు రాజు యుద్ధ వస్త్రములను ధరింపజేసారు. రాగి శిరస్త్రాణము తలకు పెట్టారు. యుద్ధ కవచమును తొడిగించారు. అటు ఇటూ నడిచాడు. ఒక సమయంలో పడిపోతానేమో అనిపించింది. కత్తి తీసి నడుముకు కట్టుకోవాలని చూస్తే చేతులకు తొడిగినవి సరిగా అమరలేదు. తన తల మీద శిరస్త్రాణము తీసి ప్రక్కనపెట్టి యుద్ధ కవచము విప్పదీయమని నౌకరుతో చెప్పాడు. ఇప్పుడు గాలి తేలికగా పీల్చుకొనుటకు వీలైనట్లుగా ఉన్నది. సౌలుకు ఎదురుగా వచ్చి "ఇవి నాకు వాడుకలేదు. వీటితో వెళ్ళలేను" అని యుద్ధ వస్త్రములను తీసి నౌకరు చేతికి అప్పగించి తన చేతికర్రను తీసికొన్నాడు. సౌలు రాజుతో కలసి ఏలా లోయకు బయలుదేరారు. తొమ్మిది గంటలకు సైన్యం దగ్గరకు చేరారు. సైన్యమునకు వెనుక భాగంలో ఎత్తైన గుట్టమీద వేయబడిన డేరాలో సౌలురాజు కొరకు వేయబడిన ఆసనం మీద కూర్చున్నాడు. దావీదు సౌలు రాజువైపు నమస్కరిస్తు న్నట్లుగా చూచి కొండమీద నుండి లోయవైపు తన కర్రను పట్టుకొని పరుగెడుచున్నట్లుగా దిగాడు. ఇశ్రాయేలు సైన్యం రాజుగారి రాకతో సిద్ధపడి నిలుచున్నారు. సైన్యం మధ్యలో రహదారివలె రెండు ప్రక్కల స్థలమిచ్చి నిలుచున్నారు. ఆ మధ్యలో దిగి వచ్చిన దావీదు అక్కడ ఎండిపోయిన లోయలోని ఏటిలో ఐదు నున్నని రాళ్ళను ఏరుకొని తన చిక్కంలో ఉంచుకొని అంతవరకు తన నడుము దట్టిలో ఉంచిన వడిశెలను బయటకు లాగి దానిని పరీక్షగా చూచి తన ఎడమ చేత పట్టుకొన్నాడు. ఎదురుగా ఉన్న పర్వతం మీద ఫిలిష్తీయుల సైన్యం కూడా దావీదును గమనిస్తున్నారు. కాని ఎవరికి ఏమి అర్థం కావడం లేదు. ఇశ్రాయేలుసైన్యం కూడా దావీదును చూస్తున్నారు. చేతిలో కత్తి అయినా లేకుండా ఈ యవ్వనస్తుడు ఎక్కడికి వెళ్తున్నాడు.ఆ రాళ్ళు ఎందుకు ఏరుకొన్నాడు? అని అనుకుంటున్నారు.

దావీదు తాను నిలుచున్న చోట నుండి ఫిలిష్తీయుల సైన్యమునంతా చూచాడు. సైన్యమంతా శిఖరం మీద వుంటే గొల్యాతు దాదాపు పర్వతం క్రిందభాగంలో నుండి బయలు దేరిరావటం చూచాడు. అతని శిరస్త్రాణం పైకొస చూడా లంటే దావీదు తన తలను పైకెత్తి చూడవలసి వచ్చినది. అంత ఎత్తైన మనిషిని తనింతకు ముందెన్నడు చూడలేదు. ఇంకా కొంచెం ముందుకు కదిలాడు. ఇప్పుడు గొల్యాతు ముఖం పూర్తిగా కనబడుతున్నది. ఆనాడు తన మీదకు వచ్చిన సింహం ముఖంవలె ఉంది. డాలు మోసే వ్యక్తి ముందు నడుస్తుంటే గొల్యాతు ఇంకొంచెం ముందుకు నడచి తన తలను వంచి దావీదును పూర్తిగా చూసాడు. దావీదును చూసినప్పుడు గొల్యాతుకు కోపం రాలేదు, విసుగు పుట్టింది. ఇప్పటికి నలుబది రోజుల నుండి ఇశ్రాయేలు సైన్యమును ప్రతిరోజు తృణీకరిస్తుంటే, ఈనాటికి వీధిలో ఆటలాడుకొనే ఎర్రని చక్కని బాలునివంటి వానిని తనమీదకు పంపిస్తారా? ఇశ్రాయేలీయులకు, వారి రాజుకు మతి భ్రమించిందా ఏమి? బాల్యం నుండి యుద్ధాభ్యాసం చేసింది ఇటువంటి రూపసిని హతమార్చటానికా? అనుకొన్నాడు. "కర్ర తీసు కొని నీవు నా మీదకు వచ్చుచున్నావే నేను కుక్కనా? నా బయలు దేవత దాగోను దేవతలు నిన్ను నాశనం చేస్తాయి" అని ఇంకొక అడుగు ముందుకువేసి నిలుచుండిపోయాడు. తనను ఇంత దగ్గరగా చూచిన తర్వాత వెనక్కి తిరిగి పారిపోతాడు అనుకున్నాడు. కాని ధైర్యంగా నిలుచుండి తనను పరీక్షగా చూస్తున్న దావీదుకు చేసైగ చేస్తూ, "నా దగ్గరకు రమ్ము నీ మాంసమును ఆకాశ పక్షులకును భూమృగములకును ఇచ్చివేతును" అన్నాడు. అతడు మాట్లాడుతుంటే ఉరిమినట్లుగా ఉంది.

"నీవు కత్తియు, ఈటెయు, బల్లెమును ధరించుకొని నా మీదకి వచ్చుచున్నావు. అయితే నీవు తిరస్కరించిన ఇశ్రాయేలీయుల సైన్యములకు అధిపతియగు యెహోవా పేరిట నేను మీదకు వచ్చుచున్నాను. ఈ దినము యెహోవా నిన్ను నా చేతికి అప్పగించును. నేను నిన్ను చంపి నీ తలను తెగవేతును. ఇశ్రాయేలీయులలో దేవుడున్నాడని లోక నివాసులందరును తెలుసుకొనునట్లు నేను ఈ దినము ఫిలిష్తీయుల యొక్క కళేబరములను ఆకాశపక్షులకును భూమృగములకును ఇత్తును. అప్పుడు యెహోవా కత్తిచేతను ఈటెచేతను రక్షించువాడు కాడని ఈ దండువారందరూ తెలిసికొందురు" అని ఆగి, వెనుక వైపున ఇశ్రాయేలు దండును చూసి "యుద్ధము యెహోవాదే" అని ఫిలిష్తీయుల దండు వైపు చూచి "ఆయన మిమ్మును మా చేతికి అప్పగించును" అన్నాడు. తన స్వరము ఇంత పెద్దగా పలుకుతుందని తనకు అప్పుడే తెలిసింది. గొల్యాతు కోపంతో కంపించిపోయాడు. దావీదును కలసికోవటానికి వడిగా ముందుకు నడిచాడు. అది చూసి దావీదు గొల్యాతుకి తనకు వున్న దూరం వడిశెల దెబ్బకు సరిపోదని వెనక్కి తిరిగి సైన్యం వైపు పరిగెత్తాడు. అది చూసిన వారికి దావీదు భయపడి పారిపోతున్నట్లుగా కనిపించింది. రెండు ప్రక్కల సైన్యంలో పెద్దగా అలజడి వినిపించింది. సైన్యం తట్టు పరుగెత్తిన దావీదు ఆగి గొల్యాతు వైపు చూశాడు. ఈ దూరం సరిపోతుంది అనుకొని వడిశెల తీసి సంచిలోనుండి ఒక రాయి తీసి వడిశెలను తిప్పుతూ రెండు అడుగులు వెనక్కి వేశాడు. ఇప్పుడు గొల్యాతు తల మాత్రమే తనకు కనబడుతుంది. వడిశెల దూరం నుండి చూసే వాళ్ళ చూపుకు అందనంత వేగంగా దావీదు కుడిచేతితో కలసి తిరుగుతున్నది. ఇప్పుడు గొల్యాతు నొసలు మాత్రమే దావీదు చూడగలుగుతున్నాడు. ఆ నొసలు మీద శిరస్త్రాణపు రేకు అడ్డుగా వచ్చి గొల్యాతు ముక్కును కనబడనీయలేదు. దావీదు కుడి చేయి ఆగిపోయింది. రాగి మీద గడ్డపారతో బలంగా పొడిచిన శబ్దం గొల్యాతు దగ్గర వినబడింది. గొల్యాతు ఒక్కసారిగా వెనక్కి విరుచుకొని మళ్లీ స్థిరంగా నిలబడ్డాడు. కండ్లు మూసుకొని ఉన్నాడో తెరచి ఉన్నాడో ఎవరికి తెలియదు. దావీదు ఒక్క ఉదుటున గొల్యాతువైపు పరిగెడుతున్నాడు. గొల్యాతులో మళ్ళీ చలనం తాటిచెట్టు ఒరిగినట్లుగా ముందుకు బోర్లపడ్డాడు. పెద్ద శబ్దం. అప్పటికి దగ్గరకు వచ్చిన దావీదు ఆ ఫిలిష్తీయుని మీద నిలుచుని వంగి గొల్యాతు ప్రక్కన ఒరలో ఉన్న అతని కత్తి బయటకు లాగాడు. నేలకు బోర్ల పడిన గొల్యాతు ముఖం నేలమీద ఆనుకొని ఉంది. గొల్యాతు మీద నిలుచున్న దావీదు రెండుచేతులతో గొల్యాతు కత్తి పట్టుకొని గొల్యాతు శిరస్త్రాణమునకు కవచానికి మధ్యలో ఉన్న మెడమీద ఒక్క వేటు వేశాడు. గొల్యాతు చచ్చిపోయాడు. మరో రెండుసార్లు అలానే పొడిచేటప్పటికి గొల్యాతు తల అతని మొండెం నుండి దూరమైంది. రెండు సైన్యములలోను పెద్ద అరుపులు ఫిలిష్తీయులు వెనుతిరిగి పారిపోతున్నారు. ఇశ్రాయేలీయుల సైన్యం వారి వెనకాల పరిగెడుతున్నారు. గొల్యాతు వీపు మీదనుండి క్రిందికి దిగుతున్నప్పుడు పెద్ద అరుగుమీద నుండి క్రిందకి దిగినట్లు అనిపించింది. గొల్యాతు ముందర డాలు పట్టుకొని నడిచిన ఫిలిష్తీయుడు ఆ డాలు అక్కడే వదిలివేసి పారిపోయాడు.

షేలహు దావీదు దగ్గర నిలచాడు. అతని కళ్ళు మెరుస్తున్నాయి. అతని డాలు ఈటె తీసుకొని రండి అంటే మొండెం నుండి వేరైన గొల్యాతు తలకు వున్న శిరస్త్రాణాన్ని విప్పదీసి తలమీద వెంట్రుకలను కుడిచేతితో పట్టుకొని, కత్తిని ఎడమ చేతితో పట్టుకొని తన డేరా వైపుగా బయలుదేరాడు. అబ్బ ఎంత బరువుగా ఉంది ఇతని తల అనుకుంటూ నడుస్తుంటే తెగిన తలలో నుండి రక్తపుబొట్లు దారిలో పడుతూ వచ్చాయి. తన కాళ్లమీద కూడా పడ్డాయి. నలుబది రోజులు ఇశ్రాయేలీయుల గుండెలు దడదడలాడించి కొద్ది నిమిషాలకు ముందు తన దేవతల పేరుమీద తనను శపించిన నాలుక జీవముగల ఇశ్రాయేలీయుల సైన్యములకధిపతియైన యెహోవాను తిరస్కరించిన నాలుక ఇప్పుడు తన చేతిలో వ్రేలాడుతున్నది. తన డేరాలో ప్రవేశించిన తర్వాత షేలహు గొల్యాతు ఆయుధములు డేరాలో ఒక మూలగా ఉంచాడు.

**(సశేషం)**

స్త్రీల విభాగం

# మరియ

యెరూషలేముకు సమీపంగా ఉన్న గ్రామాలలో బేతనియ ఒకటి. యేసు ఆ మార్గాన వచ్చినప్పుడు మార్త మరియ అనే ఇద్దరు అక్కచెల్లెలు యేసును తమ ఇంట చేర్చుకొని ఆయనకు ఉపచారము చేసేవారు.

ఒకసారి యేసు మార్త మరియల ఇంటికి వచ్చినపుడు మరియ యేసు పాదాల వద్ద కూర్చుని ఆయన మాటలు వినుచుండెను. విస్తారమైన పనులతో తల మునకలౌతున్న మార్త యేసుతో మరియను గూర్చి ఫిర్యాదు చేసింది. ప్రభువా నేను ఒంటరిగా పనిచేయుటకు నా సహోదరి నన్ను విడిచి పెట్టినందున నీకు చింత లేదా? నాకు సహాయము చేయమని మరియతో చెప్పు అన్నది అయితే యేసుక్రీస్తు మార్తతో "మార్తా, మార్తా నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడుచున్నావు గాని అవసరమైనది ఒక్కటే. మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదు" అన్నాడు.

మార్తా లోకసంబంధిత పనులలో బిజీగా లేదు. యేసు కు, ఆయన శిష్యులకు పరిచర్య చేయుటకే కష్టపడుతుంది. అది కూడ దేవుని పనే అయితే దానికంటే ఉత్తమమైనది, అవసరమైనది ఒక్కటే. అదే దేవుని పాదాల వద్ద సమయం గడపటం. దానిని మరియ గ్రహించింది. ఉత్తమమైన దానిని తెలుసుకోవడమే కాక దానిని ఎన్నుకున్నది. తన సహోదరికి ఇబ్బంది కలుగుతుందని ఆమె బాధపడుతుందని, కోప గించుకుంటుదని తెలుసు. తను పని చేయక యేసు పాదాల వద్ద కూర్చోవడం వలన కొంతమంది దృష్టికి పని దొంగగా కనిపించవచ్చు, కొందరు ఆమెను తప్పుగా అర్థం చేసు కోవచ్చు.మరియ కూడ ఇవన్నీ ఆలోచించి ఉన్నప్పటి ఆమె అవేమి పట్టించుకోక తను ఎన్నుకున్నదానిని కలిగి ఉన్నది. దేవుని దృష్టికి ఉత్తమమైనది ఎన్నుకున్న మరియ ఆదర్శ వంతురాలైన స్త్రీ.

మార్త మరియల సహోదరుడైన లాజరు రోగియై ఉన్నప్పుడు యేసుకు సమాచారం అందినప్పటికి యేసు రాలేదు లాజరు చనిపోయిన నాలుగు రోజులకు యేసు వచ్చాడు. యేసు వచ్చాడని తెలిసి మార్త యేసును కలుసు కొనుటకు వెళ్ళింది కాని మరియ వెళ్ళలేదు. ఎందుకని? బహుశా తన తమ్ముని చావు వలన కలిగిన దుఃఖము ఆమెను దేవుని వద్దకు వెళ్ళుటకు ఆటంకముగా మారి ఉండవచ్చు. లాజరు రోగిగా ఉన్నప్పుడు యేసుకు కబురు పంపారు అంటే యేసు వస్తాడని, తన తమ్ముడిని స్వస్థపరచగలడనే విశ్వాసం నమ్మిక నిరీక్షణ ఉన్నవి. అయితే వారు అనుకు న్నట్లు యేసు రాలేదు. ఫలితంగా లాజరు చనిపోయాడు కాబట్టి వారికి అమితమైన దుఃఖముతో పాటు యేసు ఎందుకు రాలేదు? ఎందుకు తమకు సహాయం చేయలేదు? వంటి అనేక ప్రశ్నలు మరియను యేసు వద్దకు వెళ్ళుటకు ఆటంకపరచి ఉండవచ్చు. అయితే యేసు మరియను అలా వదిలేయక ఆమెను పిలిపించాడు. యేసుపై కోపం, మనసులో ప్రశ్నలు ఉన్నప్పటికి ఆయన మీద ఉన్న విశ్వాసం, ఆయన తప్ప వేరే దిక్కు లేని నిస్సహాయ స్థితి ఆమెను మరల యేసు పాదాల వద్దకు చేర్చాయి. ఆమె యేసు పాదాలపై పడి ఏడ్చింది. అది చూచిన యేసు కలవరపడెను. అంటే ఆమె హృదయ వేదన ఆయన పాదాల వద్ద కుమ్మరించింది. యేసు లాజరును బ్రతికించి ఆమె దుఃఖాన్ని సంతోషంగా మార్చాడు. మరియ నిరాశ చెంది నప్పటికి ఆమె తిరిగి యేసును చేరి ఆయన పాదాలను ఆశ్రయించి తన దుఃఖాన్ని సంతోషంగా మార్చుకున్నది

యేసు తన సిలువ మరణానికి ముందు మార్త మరియలతో పులియని రొట్టెల పండగ జరుపుకున్నాడు. ఆ విందు సమయంలో మరియ ఒక సేరున్నర ఎత్తు అచ్చజటమాంసి అత్తరును యేసు పాదాలకు పూసి తన తలవెంట్రుకలతో తుడిచెను. ఇల్లంతా అత్తరు సువాసనతో నిండిపోయింది. సువార్త ప్రకటింపబడిన ప్రతిచోట ఆమెను

గూర్చి చెప్పబడుతుందని యేసు చెప్పాడు. అచ్చజటామాంసి అత్తరు చాలా ఖరీదైనది. అంత ఖరీదైన దానిని ఆమె యేసు పాదాలపై పోసింది. విలువైన వాటిని యేసుపాదాల వద్ద ఉంచి, పరిశుద్ధగ్రంథములో చరిత్రలో స్థానం సంపాదించింది మరియ.

ఉత్తమమైనదానిని కనిపెట్టి దానిని ఎన్నుకొని పరిస్థితులకు భయపడక దానిని గట్టిగా చేపట్టిన ధైర్యవంతురాలు మరియ. నిరాశ నిస్పృహలలో దేవునిపాదాల వద్ద కన్నీరు కార్చి తిరిగి తన విశ్వాసాన్ని బలోపేతం చేసుకున్న విశ్వాసి మరియ. విలువైన వాటిని యేసు పాదాల వద్ద ఉంచి, తన తలవెంట్రుకలతో ఆయనపాదాలు తుడిచి యేసును అత్యధికంగా ప్రేమించిన స్త్రీ మరియ.

క్రైస్తవ స్త్రీలైన మన జీవితాలలో ఉత్తమమైనది ఏమిటో ఎరిగియున్నామా? ఈ లోకంలో ప్రతి ఒక్కరికి అనేక రకాలైన పనులు, ప్రాధాన్యతలు ఉంటాయి. అయితే యేసు ప్రభువు అవసరమైనది ఒక్కటే అంటున్నాడు. ఆ ఒక్కటే ఉత్తమమైనది. అదే దేవుని పాదాల వద్ద కూర్చుని ఆయనను తెలుసుకొనుట. మరి నీవు విస్తారమైన పనులలో బిజీగా ఉన్నావా? లేక మరియ వలె ఉత్తమమైనదానిని కనుగొని దానిని గట్టిగా పట్టుకొని జీవించుచున్నావా?

అనేక మార్లు మనం దేవుని నుండి ఏవేవో ఆశిస్తుంటాం, మనం ఊహించిన రీతిలో దేవుడు పని చేయాలని, చేస్తాడని అనుకోని అలా జరగనప్పుడు నిరాశ చెంది మరియ వలె దేవునికి దూరంగా ఉండిపోతాం. అయితే దేవుడు కరుణామయుడు మనలను అదే స్థితిలో వదిలి వేయక మనం ఆయన దగ్గరకు చేరుటకు అవకాశం ఇస్తాడు. అంతేకాదు మనం ఊహకు అతీతంగా ఆయన పని చేస్తాడు. మన ఆలోచనలకు మించి ఆయన తన శక్తి సామర్థ్యాలు గలవాడు. మన పరిమితమైన ఆలోచన శక్తితో దేవుడు అలా చేయాలి, ఇలా చేయాలి అని ఆశిస్తుంటాం అయితే దేవుని ఆలోచనలు మన ఆలోచనల వంటివి కావు అని బైబిల్ సెలవిస్తుంది ఆయన కార్యాలు ఆయన శక్తి మన ఊహాశక్తికి మించినవి. నిరాశ నిస్పృహలలో ఆయన పాదాలను ఆశ్రయించి ఊగిసలాడుతున్న విశ్వాసాన్ని తిరిగి కట్టుకోగలిగితే మరియ వలె మన జీవితాలలోను అద్భుతకార్యాలు జరుగుతాయి. అటువంటి అనుభవం నీకున్నదా?

ఒక క్రైస్తవురాలిగా అన్నింటికంటే విలువైన నీ జీవితాన్ని, అంటే నీ సమయాన్ని యేసు పాదాల వద్ద ఉంచాలనే ఆశ కలిగి ఉన్నావా? ఆయన పాదాల వద్ద కూర్చుని ఉంచగలిగితే నీ కుటుంబంలోను నీ తోటివారి మధ్యను పరిమళసువాసనగా యేసు నీ జీవితాన్ని మారుస్తాడు. దేవుని కొరకు పరిమళసువాసనగా జీవంచునట్టి కృప దేవుడు మనకందరికి దయచేయును గాక!

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక – 8 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వ | 2 ద | ర | 3 బో | తు | | 4 కొం | | 5 యె |
| | ల్మ | | ధ | | 6 యె | హో | రా | ము |
| 7 కొ | నూ | లు | ల | | | రే | | హో |
| | తా | | 8 ను | 9 హో | యో | బు | కో | యా |
| 10 ర్న | | 11 లు | | ము | | డ | | కీ |
| 12 పె | రె | సు | జె | ర | 13 హు | | 14 స | |
| హూ | | కా | | | 15 జ | బ్డీ | యే | లు |
| 16 క | ర | డు | ను | | అ | | మూ | |
| ము | | రెం | | 17 కా | తు | ల | లు | గ |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక – 8**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం
2. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
3. డి. సురేష్ కుమార్, రెంపడం, విజయనగరం
4. జి.యస్.యస్. ప్రసాద్, వైజాగ్
5. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
6. యం. భాస్కరరావు, నందిగామ
7. టి. హదస్సా, ఆదిలాబాద్
8. కె. దివ్యవాణి, బెంగుళూరు

# సిలువ మరణం

హన్నాకృప పాఠకులకు ఈస్టర్ శుభాకాంక్షలు.

క్రైస్తవుల ఆత్మీయ వ్యవస్థకు, విశ్వాసానికి, నిరీక్షణకు ఆధారం యేసుక్రీస్తు సిలువ మరణం మరియు పునరుత్థానం.

క్రీస్తు మరణం వెనుక దేవుని ఉద్దేశ్యమేమని పరిశుద్ధ గ్రంథం సెలవిస్తుందంటే *"ఆయన సిలువ రక్తముచేత సంధి చేసి, ఆయన ద్వారా సమస్తమును, అవి భూలోకమందున్న వైనను పరలోకమందున్నవైనను వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచుకొనవలెననియు తండ్రి అభీష్టమాయెను"* కొలస్స. 1:20

సమస్తాన్ని తనతో సమాధానపరచుకొనుట దేవుని ఇష్టమై ఉన్నది అని బైబిల్ సెలవిస్తుది. పరలోక సంబంధమైనవాటి సంగతి పక్కన పెడితే భూలోక సంబంధమైన వాటిలో దేవునితో సఖ్యత కలిగి లేనిది ఒక్క మానవుడే. సమస్త సృష్టి ఆయనకు లోబడుచున్నవని బైబిల్ సెలవిస్తుంది కాబట్టి దేవుడు మనుష్యులు తనతో సమాధాన పడాలని కోరుకుంటున్నాడు. ఎందుకు దేవునికి మనిషికి సమాధానం, సఖ్యత లేదు అని ఆలోచిస్తే సృష్ట్యారంభంలో ఆదాము హవ్వలు దేవునితో సఖ్యత గలవారిగా ఉన్నారు. ఎప్పుడైతే వారు దేవునికి అవిధేయులయ్యారో దేవునితో, ఆదాముకు, ఆదాము సంతతియైన సమస్త మానవాళికి సఖ్యత కొరవడింది. అయితే దేవుడు ప్రేమస్వరూపి కనుక మానవాళి అవిధేయతను బట్టి కాక తన ప్రేమ తత్వమును బట్టి తిరిగి సమస్త మానవాళిని ఆయనతో సంధి చేసుకొనుటకు ఒక మార్గాన్ని ఎన్నుకున్నాడు. ఆ మార్గమే క్రీస్తు సిలువ మరణం.

క్రీస్తు కేవలం చిత్రహింసలకు గురికాబడి చనిపోవుట వలన దేవునికి మనుష్యులకు మధ్యవర్తి కాలేదు.

*"శరీరధారియైయున్న దినములలో మహారోదన ముతోను కన్నీళ్ళతోను, తన్ను మరణము నుండి రక్షింప గలవానికిప్రార్థనలను యాచనలను సమర్పించి భయ భక్తులు కలిగి యున్నందున ఆయన (యేసు) అంగీకరింపబడెను"* హెబ్రీ *5:7* కేవలం క్రీసు సిలువపై మరణించడం ద్వారా దేవునికి మనుష్యులకు సంధి జరుగదు. దేవునికి అంగీకారయోగ్యమైన జీవితం కలిగి సిలువ మరణం పొందిన వాని రక్తము చేత సంధి సాధ్యము. ఆదాము చూపిన అవిధేయత దేవుని నుండి మానవాళిని దూరం చేయగా యేసుక్రీస్తు చూపిన విధేయత మానవాళి దేవునితో సఖ్యత కలిగి ఉండుటకు ఒక మార్గమైనది.

*"ఆయన(యేసు) కుమారుడై యుండియు తాను పొందిన శ్రమలవలన విధేయత నేర్చుకొనెను"* హెబ్రీ *5:8*

భూమ్మీద యేసుక్రీస్తు దేవునికి అంగీకారయోగ్యమైన జీవితం జీవించాడు. దేవుడే స్వయంగా ఈయన నా ప్రియ కుమారుడు ఈయనయందు నేను ఆనందించుచున్నాను అని బాప్తిస్మము సమయంలోను, రూపాంతర కొండ మీద రెండు సందర్భాలలో సెలవిచ్చాడు. యేసు దేవుడు కాబట్టి అంగీకరింపబడలేదు, దేవుని కుమారుడైనప్పటికి ఆ హోదాను ప్రక్కన పెట్టి భూమి మీద ఆయన జీవించిన విధానాన్ని బట్టి, ఇష్టపూర్వకంగా శ్రమ అనుభవించి సిలువమరణం పొందినందున అంగీకరింపబడినాడు. ఫలితంగా మరణంపై విజయం సాధించి పునరుత్థానుడై యుగయుగములు సజీవుడుగా ఉన్నాడు.

యేసు మరణించి తిరిగి లేచాడు, అంగీకరింపబడ్డాడు అంత మాత్రన మనకి దేవునికి సఖ్యత కలిగి ఉన్నట్లు కాదు. దేవునితో సఖ్యత కలిగి ఉండడానికి యేసు అను మార్గం ఉన్నది. యేసు వలననే ఆ మార్గం కలిగినది అంతే తప్ప యేసు మరణం వలన మానవాళికి దేవునితో సఖ్యత కలగదు. అది వ్యక్తిగతమైనది. దేవునితో సమాధానం కావాలి అంటే మనం కూడ యేసును పోలి జీవించాలని బైబిల్ సెలవిస్తుంది.

**(మిగితాది 18వ పేజీలో)**

సాక్ష్యము

# దేవుని కొరకు

నా పేరు అన్నవరపు జాషువా. మా స్వగ్రామం ప్రకాశం జిల్లాలోని నాగులుప్పలపాడు గ్రామం. నా తండ్రి పేరు కోటయ్య. తల్లి పేరు రూతు. మా తల్లి గారు, మా అమ్మమ్మ గారు ప్రార్థనాపరులు. మా తల్లిగారికి వివాహమైన చాలా కాలం వరకు పిల్లలు కలుగని కారణాన హాస్పిటల్‌కి వెళ్ళి డాక్టర్ గారిని సంప్రదించగా డాక్టర్ గారు పరీక్షలు చేసి, మీ కడుపులో గడ్డ ఉన్నది. కాబట్టి మీకు పిల్లలు పుట్టరు అని చెప్పినాడట. ఆ మాటలు విని మా అమ్మ అమ్మమ్మ ఎంతో దుఃఖముతో ఇంటికి తిరిగి వచ్చినారు. వారిరువురు దేవున్ని ఎరిగిన వారు కాబట్టి దేవుని మీద నమ్మిక కలిగి ఉన్నారు. మా తల్లిగారు నాకు ఒక కుమారుని ఇవ్వు నాయనా అంతే చాలు అని ప్రార్థించసాగింది. సంతోషమ్మ అనే సహోదరి మా అమ్మ గారితో– నీ గర్భఫలము కొరకు నేను ప్రార్థిస్తాను అయితే ఏడు వారములు ఉపవాసముండి ప్రార్థించినట్లయితే దేవుడు ఖచ్చితంగా కార్యము చేస్తాడు అని అన్నది. మా తల్లిగారు ఆ సహోదరి సూచించిన ప్రకారం ఏడు వారములు ఉపవాసముండి ప్రార్థించగా దేవుడు గర్భఫలము దయచేయగా నా జననము సంభవించినది.

నా యౌవనజీవితంలో నేను దేవుని నమ్మేవాడిని కాదు. నాస్తికపరమైన ఆలోచనలతోను, విప్లవభావాలతోను ఉండేవాడను. అన్యాయమును సహించక, న్యాయం కొరకు పోరాడలని, పోరాటమే అందరికి న్యాయం చేస్తుందని నమ్మి విప్లవకారులతో తిరిగేవాడను. అంతేకాదు ఎవరైనా సువార్త ప్రకటించినా, యేసును నమ్ముకోమని చెప్పినప్పుడు వారితో యేసే అసలైన విప్లవవాది అని, ఆయన కష్టాలలో ఉన్నవారి కొరకు సమాజంలో ఉన్న ఆచారాలకు వ్యతిరేకంగా పోరాడాడు కాబట్టి యేసు విప్లవవాది నేను ఆయననే అనుసరిస్తున్ననాను అని మొండిగా సమాధానం చెప్పే వాడను. 1982 సంవత్సరములో కారంచేడులో దళితులపై జరిగిన దాడిని ఖండిస్తూ జరిగిన న్యాయ పోరాటంలో నేనూ పాల్గొన్నాను. 1987 చీరాలలో అటువంటి ఒక న్యాయ పోరాటంలో పాల్గొని సాయంత్రం తిరిగి ఇంటికి వస్తూ నా స్నేహితునితో కలిసి రైలు ఎక్కాను. నేను నా స్నేహితుడు రైలు బండికి ఉండే మెట్ల వద్ద కూర్చుని ప్రయాణిస్తున్నాము. చిన్నగంజాం, ఉప్పుగుండూరు మధ్యలో రైలు వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో సమయంలో అనుకోని విధంగా నేను రైలు నుండి క్రిందకు పడిపోయాను. వెంటనే నా స్నేహితుడు బండిని ఆపి అపస్మారక స్థితిలో ఉన్న నన్ను ట్రైన్‌లోకి చేర్చి, ప్రయాణీ కులలో ఉన్న ఒక ఆర్.యం.పి డాక్టర్ సహాయంతో రక్తము పోకుండా నా తలకు కట్టుకట్టి నన్ను ఒంగోలు గవర్నమెంటు హాస్పిటల్‌లో చేర్చారు. విషయం తెలుసుకున్న మా అమ్మ గారు విలపిస్తూ ఒంగోలు ఆసుపత్రి వద్దకు వచ్చారు. హాస్పిటల్ డాక్టర్స్ మా అమ్మగారితో బ్రతకటం కష్టమని, గుంటూరు జనరల్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళమని చెప్పినపుడు నాతల్లి నేను దేవున్ని కుమారున్ని అడిగితే ఇచ్చాడు. ఇప్పుడు వాడు చనిపోతే నేను చనిపోతాను అని అన్నదట. చివరికి డాక్టర్లు నన్ను పరీక్షించి మా వంతు ప్రయత్నం మేము చేయాలి కాబట్టి ఆపరేషన్ చేస్తాము, అయితే బ్రతుకుతాడో లేదో తెలియదు. ఒక వేళ బ్రతికినా మతిస్థిమితం ఉండదు అని చెప్పారు. ఐదు, ఆరు రోజులు పూర్తిగా స్పృహలో లేకపోవడంతో నేను చనిపోతానని అందరూ నమ్మారు. నేను బ్రతుకుతానని డాక్టర్లు కూడ నమ్మలేదు. ఏమి చేయలేని స్థితిలో దేవుని వైపు చూస్తూ రాత్రింబగళ్ళు కన్నీటి ప్రార్థన చేస్తున్న మా అమ్మ గారి ప్రార్థన వలన, దేవుని కృప వలన పది రోజుల తర్వాత నాకు స్పృహ వచ్చింది. అద్భుత రీతిగా కోలుకొని ఇంటికి చేరాను.

ఆరోగ్య రిత్యా విప్లవపోరాటలలో పాల్గొనడం తగ్గింది. ఆ భావాలు తగ్గు ముఖం పట్టాయి. రెండు సంవత్సరము

ల వ్యవధిలోనే ఒక విశ్వాసితో నా వివాహం జరిగినది. ఆమెను సంతోషపెట్టుటకు ఆమెతో పాటు చర్చికి వెళ్ళేవాడను. కానీ యేసుతో ఎటువంటి సంబధం లేని జీవితం జీవిస్తున్న తరుణంలో సామ్యేల్ ప్రసాదు అనే దైవజనులు మా ఊరిలో మూడు రోజులు మీటింగులు ఏర్పాటు చేశారు. ఆయన తన సాక్ష్యమును పంచుకుంటూ రాడికల్స్‌తో తిరిగి, దేవుని, దేవుని విశ్వాసులను దుర్భాషలాడే వాడను. అయినను మనసులో ఏదో తెలియని వెలితి. ఆ మానసిక వేదన నన్ను దేవుని వద్దకు చేర్చింది. తన కొరకు ఎన్నో చేసిన ఆయన కొరకు ఏదైనా చేయాలని నిర్ణయం తీసుకునేలా చేసిందని చెప్పారు. ఆ మాటలు విన్న నాకు నా గత జీవితం కళ్ళ ముందు కదలాడింది. దేవుని గురించి న అనేక ప్రశ్నలు తలెత్తాయి. చనిపోవలసిన తనకు ఈ జీవితం ఇచ్చింది ఎవరు? ఎందుకు? అని ఆలోచించ సాగాను. న్యాయపోరాటం కారణాన తను బ్రతకలేదని, విప్లవం జీవం పోయలేదని అర్థమైంది. యేసు కేవలం విప్లవవాది మాత్రమే కాదని, ప్రేమ కలిగిన దేవుడని తెలుసు కొని 1994లో బాప్తిస్మము తీసుకొని నాకు ఎన్నో చేసిన నా దేవునికి నా జీవితాన్ని అర్పించి ఆయన సేవలో కొనసా గుతున్నాను. ప్రభువు అన్ని విషయములలో నాకు తోడై యుండి ఆయన సేవ కొరకు వాడుకొనుచున్నాడు. నా ఆత్మీయ ఎదుగుదల కొరకు, సేవ కొరకు ప్రార్థించండి.

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యము ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

## చందాదారుల వివరములు

1. అపొ. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)–1500 (నెలకు)
2. దాసరి శ్యామ్ హయ్యర్ పాల్ – 2000 (నెలకు)
3. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (నెలకు)
4. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/–
5. ముద్ద సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
6. జి. స్టాలిన్ (కావలి)
7. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
8. సుమతి చక్రవర్తి
9. దాసరి. మాధవరావు
10. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/–
11. జి. కళావతి, ఒంగోలు 350/–
12. వి. కస్తూరి, భీమవరం 500/–
13. జయ, గుంటూరు – 1500/–
14. కె. రజిని, నరసరావుపేట – 1000/–
15. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం – 500/–
16. శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ – 1000/–
17. శ్రీ టి. సునీల్ కుమార్, నెల్లూరు – 2500/–

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

## పాఠకులకు గమనిక

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**

కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,
ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక
6వ లైను, క్లాపేట, ఒంగోలు–523001
ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726

# ఈసా బర్ అబ్బ

"ఈసా బర్ (అ) రబ్బ" ఉరఫ్ 'బరబ్బ' – ఈ పేరుకు 'దేవుని కుమారుడైన ఈసా' అని 'తిరిగివచ్చిన ఈసా కుమారుడు' అనే అర్థాలున్నా, బరబ్బ తండ్రి యూదుల బోధకుడు (రబ్బ) కాబట్టి అతని స్నేహితులు బరబ్బాను "బోధకుని కుమారుడైన ఈసా" గానే సంబోధించేవారు. యూదుల స్వాతంత్ర్యం కొరకు రోమా రాక్షస పరిపాలనను ధిక్కరించిన ఉద్యమ నాయకుడు బరబ్బ (మత్తయి 27: 16). అధికారుల నిరంకుశత్వానికి నిరసనగా విప్లవ శంఖం పూరించిన విప్లవ కారుడు బరబ్బ (మార్కు 15:7) బంధింప వచ్చిన రోమా సైనికులను ఊచకోత కోసిన నరహంతకుడు బరబ్బ (లూకా. 23:19) రాజ ఖజనాను దారికాచి దోచుకున్న బందిపోటు దొంగ బరబ్బ (యోహాను 18:40). రోమా ప్రభుత్వానికి సింహస్వప్నం బరబ్బ! ఎట్టకేలకు ఆ విప్లవ నాయకుణ్ణి బంధించి, కారాగార నేలమాగళిలో ఇనుప సంకెళ్ళతో కట్టివేసింది రోమా ప్రభుత్వం! రేపు జరగబోయే పస్కా పండుగ రోజున అతనికి సిలువ కంబంపై మరణ శిక్షను అమలు చేస్తారు. అయినా ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయాడు బరబ్బ.

ఆ నిర్భయ సుషుప్తి దశలో 'దిగంబర దేహంపై సైనికులు ఝుళిపించిన కొరడాలు, బరబ్బ చర్మాన్ని చీల్చి గాయాలు చేస్తున్నాయి. ఉప్పునీటిని ఆ గాయాల పై పోసి దేహాన్ని మండే నిప్పుల గుండంలా చేస్తున్నారు కసితీరని కసాయిలు. ఆ చిత్రహింసకు కళ్ళు బైర్లు కమ్మి శోషతో సోలిపోతే కాల్చిన ఇనుపకొర్రులతో వీపు మీద వాతలు పెడుతున్నారు రోమా రాక్షసులు. ఆ మరణయాతన భరింపరానిది! దానిని పరిసమాప్తము చేయాలని పడిలేస్తూ మరణసిలువను మోస్తున్న బరబ్బను పెదవులు చిట్లి రక్తం కారేలా బలంగా తన్నాడో రోమాసైనికుడు.....' "నేను మరణించినా నా ఆశయం మరణించదు. అది రోమాసామ్రాజ్యాన్ని పతనం చేయక తప్పదు" అని కలవరిస్తున్న బరబ్బ చెంప చెళ్ళుమనింది. కల చెదిరి కళ్ళు బైర్లు కమ్మాయి. తల విదిలించి కళ్ళు తెరిచాడు. ఎదురుగా వార్తాహరుడు; అతని చేతిలో రాజాజ్ఞ పత్రం ఉంది; దాన్ని చూస్తూ, "నా మరణ ఘడియను వినిపించేందుకు వచ్చావు కదూ! యూదులు స్వేచ్ఛను కబళించే ఆ రోమా శాసనం ఎప్పటికైనా రోమా రాజ్యాన్నే కబళించి వేస్తుంది" అంటూ పటా పటా పళ్ళు కొరుకుతూ బంధించిన కాలితో నేలను బలంగా తన్నాడు.

"బరబ్బ! ఆవేశపడి పతనం కావొద్దు. నీ చీకటి జీవితానికి వెలుగు వచ్చింది; ఆ వెలుగు నిన్ను మరణశిక్ష నుండి విముక్తుణ్ణి చేసింది. ఇదిగో, ఇది నీ విడుదల పత్రం" అని ఆ వార్తాహరుడు అంటుంటే నలుగురు సైనికులు వచ్చి బంధించిన గొలుసులను తొలగించి బరబ్బాను బంధ విముక్తుణ్ణి చేశారు. బరబ్బ నిశ్చేష్టుడై శిలలా నిలబడి పోయాడు. తనకు, ప్రాణబిక్ష! తనకా విడుదల! తను విన్నది నిజమేనా!? 'సందేహంగా, సంభ్రమంగా సైనికులను చూసి వికటాట్టహాసం చేస్తూ, "నాకు స్వేచ్ఛనిచ్చి రోమా ప్రభుత్వం తన పతనాన్ని తానే కోరుకుంది" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు. "బరబ్బా! నీకు స్వేచ్ఛ నిచ్చింది రోమా ప్రభుత్వం కాదు!" "మరెవరు?" "అదిగో, అతడే నీ మరణ శిక్షను అనుభవించేందుకు సిద్ధపడుతున్న నిర్దోషి. నీ యూదులు కోరుకున్న పస్కా బలిపశువు" అంటూ ప్రేతోర్యం వైపు చూపెట్టాడు వార్తాహరుడు. అటువైపు చూశాడు బరబ్బ. అక్కడ ఇనుప మేకులు గ్రుచ్చిన రాతి దిమ్మెపై కూర్చొని జడల కొరడా దెబ్బలను మౌనంగా సహిస్తూ చిత్ర హింసలను అనుభవిస్తున్న ఒక వ్యక్తిని చూశాడు.

'అతనెవరు? ఎక్కడో చూశానే! ఎప్పుడు కలిశాను? ఆ... ఇస్కరియోతు యూదా పరిచయము చేసిన.... అహింసావాది,...యషువా కదూ!' అనుకొంటూ కళ్ళు చికిలించి చూశాడు. "నేను నడిచేది ప్రేమ పథం. నీవు నడిచేది క్రాంతి పథం. నీవు కోరుకుంటున్నది సమరం. నేను కోరుకొం

టున్నది సమాధానం. విప్లవం ప్రాణాలను బలి తీసుకొం టుంది. శాంతి ప్రాణాలను రక్షిస్తుంది. కత్తి కంటే బలీయ మైనది ప్రేమ. ఈ లోకాన్ని ప్రేమతో జయించు. కత్తితో కాదు బరబ్బ!" బేతెస్థ కోనేటి దగ్గర మొదటిసారి యేసుని కలిసికొనిప్పుడు యేసు మాట్లాడిన ఆ మాటలే ఇప్పుడూ బరబ్బ అంతరంగంలో ప్రతిధ్వనించాయి. 'తన స్థానంలో యేసు!... తన శిక్షను యేసు!... తన కోసం యేసు!... యేసు ప్రేమ తన మరణానికి జీవం పోస్తుంది! తనకు విముక్తి ప్రసాదిస్తుంది'- ఆ భావం బరబ్బ హృదయాన్ని కృతజ్ఞతతో నింపింది. యేసుని కలిసే అనుమతి లేక మౌనంగా నివాళులర్పించి, అక్కడ నుండి నిష్క్రమించాడు. కారాగారం వెలుపలికి వచ్చేసరికి బారెడు పొద్దెక్కింది. దూరాన కపాలగిరి కళ్ళు తెరుచుకొని చూస్తుంది. ఒకనాటి తన అనుచరులు దిస్మాస్, జెస్టాస్ ఎవరి మరణకొయ్యను వారు మోస్తూ కపాలగిరిపై మరణించేందుకు ఒకరి వెనుక ఒకరు సాగిపోతున్నారు. వారితో పాటు మరణించవలసిన తన ప్రాణం, ఇంకొకరి ఊపిరితో తనలో బ్రతుకుతుంది! ఈ ఊపిరి తనది కాదు. తనకోసం మరణించే యేసుది! ఆ భావం బరబ్బ ఆత్మను తొలిచి వేసింది. ఆ ప్రేమ మూర్తిని, ఆ యేసుని ఎలగయినా చివరిసారి కలవాలని వెనక్కి తిరిగాడు. అంతలో స్వాగతం పలుకుతూ తన అనుచరులు గుంపులు గుంపులుగా వచ్చి అతనిని భుజాలపై మోస్తూ మధుశాల వైపు పరుగులు తీశారు. వారికి అభిము ఖంగా బరబ్బ ప్రియురాలు ఆనందంతో ఎదురొస్తుంది. ఆమెను చూచిన బరబ్బ, స్నేహితుల భుజములపై నుండి క్రిందికి దుమికి బాహువులు చాపి ఆమెను ఆహ్వానించాడు. ఉత్తుంగ తరంగంలా ఎగసి బరబ్బ ఎదపై వాలిపోయి " నీ కోసం, నీ విడుదల కోసం రోమా న్యాయస్థానంలో అందరి కంటే బిగ్గరగా నేనే గొంతు చించుకొని అరిచాను. ఆ యేసును సిలువ వేయమని, సిలువవేసి చంపమని అరచి అరచి కేకలు వేశాను" అంటూ ఆలింగనం చేసుకొంది.

'తప్పు చేశావు ప్రియా!' - బరబ్బ ఆత్మక్షోభ ప్రియా అంతరగాన్ని తాకింది. అయోమయంగా బరబ్బ కళ్ళలోకి చూచింది. కన్నీరెరుగని అతని కళ్ళల్లో పశ్చాత్తాపం ప్రతి ఫలించింది. అసహనంగా 'బరబ్బా!' అంటూ దూరంగా జరిగి వింత వ్యక్తిని చూస్తున్నట్లు చూస్తూ నిలబడి పోయింది. అంతలో చుట్టుప్రక్కల గ్రామంలోని స్త్రీలు పురుషులు తండో పతండాలుగా గొల్గొత కొండ వైపు పరుగైన నడకతో వడి వడిగా వెళ్ళడం చూచాడు బరబ్బ. తనను దాటి గబగబా వెళ్తున్న ఒక వృద్ధుణ్ణి ఆపి, అతని కళ్ళను పరిశీలనగా చూస్తూ, " తాతా!నువ్వు గ్రుడ్డి వాడివి కదా!" అని అడిగాడు బరబ్బ. "అవును. ఒకప్పుడు నేను గ్రుడ్డివాడినే. కానీ, యేసు నా కళ్ళకు వెలుగు నిచ్చాడు. కృతజ్ఞత లేని యూదులు ఆయనను ఈ రోజు సిలువ వేస్తున్నారు. ఆయనను నేను చూడాలి" అంటూ వెళ్ళబోతూ ఆగి, బరబ్బను ఆపాద మస్తకం చూచి, "నీవు బరబ్బవా? నీ స్వరం అలానే ఉందే!" అని ఆశ్చర్యంగా అడిగాడు. అవునన్నట్లు తలూపాడు బరబ్బ. "సంతోషం మరి వస్తా" అన్నాడు తాత. "నీతో నేనూ వస్తున్నాను" అంటూ స్నేహితులను, అనుచరులను చివరకు ప్రియురాలిని కూడా వదిలి యేసుని కలవాలని, కలిసి కృతజ్ఞత తెలపాలని ఆశతో ఆతృతగా గొల్గొతా కొండకు పరిగెత్తాడు బరబ్బ.

ఏనాడు నేరస్తుల మరణాన్ని చూచేందుకు ఆసక్తి చూపెట్టని జనులు ఆనాడు నిరపరాధియైన యేసు మర ణాన్ని తనివితీరా చూచి రాక్షసానందాన్ని పొందాలని బారులు తీరి నిలుచొని ఉన్నారు. కపాల స్థలానికి రాకూడని స్త్రీలు కూడా ఆనాడు గుండెలు బాదుకొంటూ రోదిస్తూ యేసు వెంట నడుస్తున్నారు! అందర్నీ వెనక్కు దోసుకుంటూ ముందు వరసలో నిలబడ్డాడు బరబ్బ. బారులు తీరిన జన సమూహం మధ్య భారమైన సిలువను మోస్తూ కుప్పకూలి పోయాడు యేసు. నేలకొరిగిన యేసు మోస్తున్న సిలువ మానుని తన భుజముల పైకెత్తుకొని గొల్గొతా వరకు మోయాలనే తపనతో ముందుకు వెళ్తున్న బరబ్బను రోమా సైనికులు వెనక్కిలాగి తన ప్రక్కనే ఉన్న ఒక వ్యక్తిని ముందుకు త్రోసి ఆ సిలువను అతని (కురేనీయుడైన సీమోను) భుజాలపై మోపారు. తను మోయవలసిన తన

సిలువను క్షణకాలం మోసే అవకాశం కూడా తనకు దక్కనందుకు లోలోన దుఃఖించాడు బరబ్బ. అది గ్రహించిన యేసు నెత్తురు గుంతలైన కనులపై జారిన ముళ్ళ కిరీటపు కంతలలో నుండి బరబ్బను ఓదార్పుగా చూచాడు! ఆ చూపు బరబ్బ హృదయాన్ని అవ్యక్తమైన ప్రశాంతతతో నింపి వేసింది. కర్తవ్యాన్ని బోధించింది.

యేసుని సిలువమ్రానుపై వ్రేలాడదీశారు. తలపై ముళ్ళ కిరీటం మోస్తూ, చితికిన పెదవులతో సప్తసూక్త సందేశాన్ని మానవాళికి వినిపించి, సూర్యాస్తమయ వేళలో ప్రాణత్యాగం చేసిన యేసుని భూస్థాపితం చేశారు. ఆ సంఘటన బరబ్బను అపరాధభావంతో కుదించివేసింది. కరుడుగట్టిన తన హృదయంలో పశ్చాత్తాప ప్రకంపనలు ప్రజ్వరిల్లాయి. తను చేసిన నేరాలు, ఘోరాలు, పాపాలను తలచుకుంటూ, యేసు పవిత్ర రక్తముతో తడిచిన యేసు లేని సిలువమానుని కౌగిలించుకొని క్షమాపణకోసం పరితపించాడు. ఆ చీకటిలో, ఎడమవైపు నుండి "మిత్రమా! బరబ్బ! శిక్ష నుండి విముక్తి పొందావు. ఉద్యమానికి మళ్ళీ ఊపిరి పోసి రోమా సామ్రాజ్యాన్ని అంతం చేసి నీ కత్తికి ఎదురులేదని నిరూపించు. లే వెళ్ళు." అని సిలువమానుపై వ్రేలాడుతున్న ఇద్దరు దొంగల్లో ఒకడైన జెస్టాస్ ఆయాసపడుతూ బరబ్బాను విప్లవానికి పురిగొల్పుతున్నాడు. "వద్దు మిత్రమా! నీవు తాకిన యేసు సిలువ రక్తము, నిన్ను పునీతునిగా చేసింది. విప్లవాన్ని విసర్జించు, దిశదిశలకు యేసు ప్రేమను ప్రకటించు" అని కుడి వైపున సిలువమానుపై కొన ఊపిరితో వ్రేలాడుతున్న దిస్మాస్ బరబ్బాను సిలువ మార్గంలో నడవమని ప్రోత్సహిస్తున్నాడు. ఆ రాత్రంతా సిలువ పంచన కూర్చొని తెల్లవారుతుండగా అందరికి దూరంగా యెరూషలేముకు దక్షిణంగా ప్రయాణం సాగించాడు బరబ్బ. ఆకలి దప్పులు మరచి ఏకంగా రెండురోజులు పయణించి 'బీర్–షవ' (40 మైళ్ళు) పొలిమేర చేరుకొని ఆ పూటకు ఇసుక కప్పిన ఒక గుహలో బస చేశాడు. సాయంసంధ్య వేళలో వెలుగు కిరణాలు ఆ గుహలో ప్రవేశించాయి! "బరబ్బ" – సుమధుర స్వరం లాలనగా వినిపించింది. సుశాంతి స్వరూపం. దివ్యతేజమై ముందు నిలిచింది.

"ప్రభూ!యేసూ!! నువ్వా!!! నువ్వు మరణించావు కదా!!!!" అంటూ భీతిల్లి సాగిలపడ్డాడు బరబ్బ. "నీ కోసం మరణాన్ని ఓడించి జీవిస్తున్నాను బరబ్బ" అంటూ తను పొందిన గాయాలలో నుండి ప్రసరించిన దీవెన కిరణాలతో బరబ్బను ఆశీర్వదించాడు యేసు. "నీవిచ్చిన ఈ జీవంతో నీ బలియాగాన్ని చాటించాలని సుదూర తీరాలకు పయనిస్తున్నాను ప్రభూ!" అన్నాడు బరబ్బా. "నాకు తెలుసు నీవు చూచిన ఈ పునరుత్థాన రక్షణను, నిన్ను ఎడబాయని నా ప్రేమను కూడా ప్రజలకు ప్రకటించు" అని అంతర్ధానమయ్యాడు యేసు.

ఉత్తేజం నిండుకున్న ఉజ్జీవం సువార్త ప్రకటనకై పరుగులెత్తింది. 'నెగేబ' ఎడారిలో ఇసుక తుఫాను చెలరేగింది; చుట్టుప్రక్క గ్రామాలు ఇసుకముసుగుల్లో మసకబారిపోయాయి. కానరాని దారిలో దరితెలియని గమ్యాన్ని వెతుక్కుంటూ ఎనిమిది రోజులు పయణించి "ఇఖలత్" అనే పట్టణం చేరి అక్కడి చుట్టు ప్రక్కల ప్రజలకు సువార్త ప్రకటించడం మొదలుపెట్టాడు బరబ్బ. తన సువార్త పయనంలో బాధాపరితప్తురాలైన ఒక వితంతువుని కలుసుకున్నాడు. ఆ విధవరాలి ఏకైక కుమారున్ని రోమాసైనికులు తిమ్నా లోయలో ఉన్న రాగి గనుల్లో(Copper mines)పని చేసేందుకు బలవంతంగా లాక్కొని వెళ్ళిపోతున్నారు. ఆ గనుల్లో పని చేసేందుకు వెళ్ళినవారు తిరిగి రారు. రాలేదు కూడా! అదొక మరణలోయ. ఆమె వ్యధకు కారణం తెలుసుకున్న బరబ్బ, "సోదరీ! నీ ఒక్కగానొక్క కుమారునికి బదులు ఆ గనులలో నేను వెళ్ళి పనిచేస్తాను. నీవు నిశ్చింతగా ఉండు" అని చెప్పి రాగి గనులలో ఆ విధవరాలి కుమారునికి బదులు బానిసగా పని చేసేందుకు రోమా సైనికులతో తిమ్నాకు వెళ్ళాడు. రేయింబవళ్ళు పని చేస్తూనే గని కార్మికులకు సువార్త బోధించి వారిని విశ్వాస మార్గంలో నడిపాడు బరబ్బ. అది ఇష్టం లేని రోమా సైనికులు బరబ్బను కొరడాలతో కొట్టేవారు. పాదాలను సమ్మెటతో బాదేవారు.

**(మిగతా 20వ పేజీలో...)**

చిన్నపిల్లల పేజి

# విలువైనది

రింగు రింగుల బంగారు రంగు జుట్టు ఎగురుతుంటే ఉల్లాసంగా తన తల్లితో పాటు షాపింగ్ చేస్తుంది ఆరేళ్ళ హైడి. డబ్బులు చెల్లించే కౌంటర్ వద్ద ఉన్న తన తల్లితో నిలబడిన హైడి చూపులు అక్కడ ఉన్న ఒక చిన్న పింక్ కలర్ బాక్సు మీద పడ్డాయి. అదొక మెరిసే తెల్లటి ముత్యాల హారం. ఆ ముత్యాలను చూడగానే హైడి కళ్ళు మెరిసాయి. "ప్లీజ్, మమ్మీ. నాకు ఆ హారం కావాలి ప్లీజ్, మమ్మీ, ప్లీజ్!" అని తల్లిని బ్రతిమాలింది. తల్లి ఆ పింక్ బాక్స్ వెనుక భాగంలో ఉన్న దాని ఖరీదును చూసి, పాతిక రూపాయలు అన్నది హైడి నీలి కళ్ళల్లోకి చూస్తూ. హైడి కళ్ళు ఆ హారం మీదనే ఉన్నాయి. తల్లి హైడిని ఎత్తుకొని నీకు నిజంగా ఆ హారం కావాలంటే, నీ పుట్టినరోజుకు అమ్మమ్మ డబ్బులు ఇస్తుంది కదా వాటిని వృధాగా ఖర్చు చేయక నీకు ఇష్టమైన ఈ హారాన్ని కొనుక్కో అన్నది తల్లి.

హైడి ఇంటికి వచ్చి తన కిడ్డీ బ్యాంకును ఖాళీ చేసి, లెక్కించింది. పదమూడు రూపాయలు ఉన్నాయి. ఎలాగైన ఇరవై ఐదు రూపాయలు సమకూర్చడానికి నిశ్చయించుకొని తల్లి చెప్పే ప్రతి పని ఎంతో శ్రద్ధగా చేయసాగింది. హైడి శ్రద్ధ వెనుక కారణం ఆ ముత్యాల హారం అని తెలిసిన తల్లి ఆమెను ప్రోత్సహిస్తూ ప్రతి పనికి రూపాయి ఇచ్చేది. ఆమెకు హైడి చెప్పిన ప్రతీ పని చేయడమే కాక ఆ పనిని ఎంతో శ్రద్ధగా చేయడం గమనించిన హైడి నాయనమ్మ ముచ్చటపడి హైడికి పది రూపాయలు ఇచ్చింది. ఆ పది రూపాయల నోటు చూడగానే హైడి ఆనందానికి హద్దులు లేవు. ఆ పది రూపాయలు తీసుకొని గబగబ వెళ్ళి తన కిడ్డీబ్యాంక్ లోని డబ్బులు లెక్కపెట్టి తల్లి వద్దకు వెళ్ళింది.

హైడి పుట్టినరోజున వేసుకున్న క్రొత్తబట్టలతో తాను ఎంతో ఇష్టపడి, కష్టపడి సంపాదించుకున్న ముత్యాల హారాన్ని ధరించింది. ఫంక్షన్‌కు వచ్చిన వారందరూ ఆమె ముత్యాల హారాన్ని పొగడడం హైడీకి ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఆమె తన ముత్యాల హారాన్ని సండేస్కూల్‌కి వెళ్ళినప్పుడు స్కూల్‌కి వెళ్ళినప్పుడు ఇంచుమించు ప్రతిరోజు ధరించేది. అవి నిజమైన మంచి ముత్యాలు కావు గనుక తడిస్తే మెడ పచ్చగా మారే అవకాశం ఉందని తల్లి చెప్పిన కారణాన కేవలం ఈతకు వెళ్ళినప్పుడు లేదా బబుల్ బాత్ చేసినప్పుడు మాత్రమే ఆ హారాన్ని తీసేది హైడి.

హైడికి వాళ్ళ నాన్నంటే చాలా ఇష్టం. ఎంత పని ఉన్నా తన పనులన్ని ప్రక్కన పెట్టి, ఆమెకు కథ చెప్పి నిద్రపుచ్చే వాడు. ఒకరోజు రాత్రి కథ పూర్తి కాగానే హైడితో నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా? అని అడిగాడు తండ్రి. నాన్న నేను నిన్ను ప్రేమిస్తున్నానని నీకు తెలుసు కదా అన్నది హైడి. అయితే నీ ముత్యాలహారం నాకు ఇవ్వు అన్నాడు తండ్రి. అయ్యో, నాన్న, నా ముత్యాలహారం కాకుండా మీరు ఏదైనా అడగండి. నా బార్బీ బొమ్మను కాని, నాకెంతో ఇష్టమైన పింక్‌యూనికార్న్ (గుర్రం) ఏదైనా సరే మీకు ఇస్తాను అన్నది హైడి. సరే బంగారు తల్లి, నాన్న నిన్ను ప్రేమిస్తున్నాడు గుడ్ నైట్ అని చెప్పి ఆమె చెంపపై ముద్దు పెట్టాడు తండ్రి. దాదాపు ఒక వారం తర్వాత, స్టోరీ టైమ్ తర్వాత, హైడి డాడీ ఆమెను నీవు నన్ను ప్రేమిస్తున్నావా? అని అడిగాడు. డాడీ, నేను నిన్ను ప్రేమిస్తున్నానని మీకు తెలుసు కదా అంది హైడి. అలా అయితే నాకు నీ ముత్యాలు ఇవ్వు అన్నాడు తండ్రి. అయ్యో నాన్న, నా ముత్యాలు కాకుండా ఇంకేదైనా అడగండి, నా పుట్టినరోజు కోసం నేను పొందిన సరికొత్తదైనా సరే మీకు ఇస్తాను. మీరు నా బర్త్‌డేకి ఇచ్చిన క్రొత్త బోర్డ్‌గేమ్ నాకెంతో నచ్చింది అదైనా మీరు తీసుకో వచ్చు కానీ ముత్యాల హారం నేనివ్వను అంది హైడి చిన్నగా. పర్లేదులే తల్లి బాగా నిద్రపో అంటూ కూతుర్ని సున్నితంగా ముద్దాడి వెళ్ళిపోయాడు తండ్రి.

కొన్ని రోజుల తర్వాత ఆమె డాడీ లోపలికి వచ్చినప్పుడు, హైడి మంచం మీద కూర్చొని ఉంది. అతను దగ్గరగా వచ్చినప్పుడు, అతను ఆమె గడ్డం వణుకుతున్నట్లు గమనించాడు మరియు కన్నీరు ఆమె చెంపపై కారుతుంది. "ఏమిటి హైడి? ఏమైంది? అడిగాడు తండ్రి. హైడి ఏమీ మాట్లాడ లేదు కానీ మూసి ఉన్న తన చిన్న చేతిని పైకి లేపింది.

ఆమె దానిని తెరిచినప్పుడు, ఆమె చేతిలో చిన్న ముత్యాల హారము ఉంది. చిన్నగా వణుకుతూ చివరికి "ఇదిగో డాడీ.. నీ కోసమే" అన్నది హైడి. హైడి కళ్లలో కన్నీళ్లు రావడం చూచిన తండ్రి కళ్ళు కూడ చెమ్మగిల్లాయి. అతను హైడి చేతిలో నుండి ఆ హారాన్ని తీసుకొని, తన జేబులో నుంచి ఒక చిన్న బ్లూ కలర్ వెల్వెట్ బాక్స్‌ను హైడి చేతిలో పెట్టాడు. హైడి ఆశ్చర్యంతో ఆ వెల్వెల్ బాక్సును తెరచి చూసి నిశ్చేష్టురాలైంది. అది నిజమైన, విలువైన ముత్యాలు పొదిగిన హారం. హైడికి తన పాత ముత్యాల హారం కంటే ఇదెంతో నచ్చింది వెంటనే తండ్రిని ముద్దాడి హత్తుకుంది. హైడి దుఃఖం సంతోషంగా మారిపోయింది.

తండ్రి తన కూతుర్ని ప్రేమించాడు, అందుకే ఆమెకు నిజమైన ముత్యాలు ఇవ్వాలని ఆశించాడు. ఆ ముత్యాలు ఎల్లప్పుడు ఆయనతోనే ఉన్నాయి అయితే హైడి పిచ్చి ముత్యాల హారాన్ని వదులుకోవాలని అతను వేచి ఉన్నాడు. మన పరలోకపు తండ్రి కూడ మనలను ప్రేమించి మనకు విలువైనవి, అమూల్యమైనవి ఇవ్వాలని ఆశిస్తున్నాడు అయితే వాటిని పొందుటకు మన దగ్గర ఉన్న, అతి విలువైన విగా మనకు కనిపించేవాటిని వదులుకోవాలని ఆయన వేచియున్నాడు. ఎప్పుడైతే దేవుని నిమిత్తం నీకు విలువైన వాటిని వదులు కొనుటకు సిద్ధపడతావో ప్రేమాస్వరూపి అయిన తండ్రి మనకు అంతకంటే విలువైన వాటిని అనుగ్రహిస్తాడు. మనిషికి అన్నింటికంటే విలువైనది ప్రాణం. నిజానికి ప్రాణం ఉంటేనే మనిషికి విలువ. అటువంటి ప్రాణాన్ని యేసుక్రీస్తు ఇష్టపూర్వకంగా సిలువలో అర్పించాడు. ఫలితంగా మరణాన్ని జయించి పరమ తండ్రి యైన దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడై యుగ యుగములు సజీవుడుగా ఉన్నాడు. దేవుని కొరకు విలువైన నీ జీవితాన్ని, నీ జీవితంలో విలువైన వాటిని, విలువైన వారిని వదులు కోవడానికి నీవు సిద్ధంగా ఉంటే మనం ఊహించేవాటి కంటే గొప్ప మేలులను పొందుటకు అర్హులమౌతాం.

*"దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" 1కొరింథీ 2:9"*

**(11వ పేజీ తరువాయి...)**

*"దేవుడెవరిని ముందుగా ఎరిగెనో వారిని వారు తన కుమారు నితో సారూప్యము గలవారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను...ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను" రోమా 8:29,30*

*"క్రీస్తుయేసునకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగి యుండుడి" ఫిలిప్పీ 2:5*

*"క్రీస్తు శరీరమందు శ్రమపడెను గనుక మీరును అట్టి మనస్సును ఆయుధముగా ధరించుకొనుడి" 1పేతురు 4:1*

పై లేఖనాల ఆధారంగా మనం క్రీస్తును పోలి, క్రీస్తుకు కలిగిన మనస్సు కలిగి, క్రీస్తు సారూప్యముతో జీవించిన ట్లయితే క్రీస్తు ద్వారా దేవునితో సమాధాన పడినవారమౌతాం

*"పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించు కొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బ్రతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైయున్నది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూ లమును సంపూర్ణమైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి" రోమా 12:1,2*

సజీవయాగముగా శరీరమును సమర్పించి అంటే తిరిగి తీసుకొనుటకు వీలులేని విధముగా శరీరమును దేవుని అధికారానికి లోబరచాలి. శరీరముతో చేయు ప్రతి పని అంటే మన స్నేహాలు, అలవాట్లు అన్నీ దేవునికి ఆమోద యోగ్యంగా ఉండాలి. అదే యుక్తమైన సేవ. లోకమర్యాదను అనుసరింపక అంటే దేవుని చిత్తానికి లోకం ఎప్పుడూ వ్యతిరేకమే కాబట్టి లోకానికి ఎదురీదాలి, శ్రమలు ఎదుర్కొ వాలి. శ్రమలు సహిస్తూ దేవుని చిత్తాన్ని పరీక్షించి తెలుసు కొనునట్లు మనస్సును నిరంతరం మార్చుకుంటు అంటే మారుమనస్సుపొందుతూ క్రీస్తు వలె రూపాంతరం చెందాలి. క్రీస్తువలె రూపాంతరం చెంది క్రీస్తు ద్వారా దేవునితో సమాధాన పడుటయే యేసుక్రీస్తు సిలువ మరణం యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

# కృపాదానం

కృపాదనం నూజివీడు ప్రక్కన ఈదర అనే గ్రామంలో మెట్రోపాలిటన్ పాదిరిగా 1952లో పని చేశారు. మేము అంటే మా మార్తక్క, నేను, నా తమ్ముడు జోషి హైస్కూలులో 7,8 తరగతులు చదవటానికి ఆకిరిపల్లికి 7కిలోమీటర్లు నడిచేవారం. తర్వాత ఒంగోలు హాస్టలులో చేరాం. ఆ ఈదర గ్రామానికి బస్ సౌకర్యం లేదు. ఆకిరిపల్లి నుండి విజయ వాడ 30 కిలోమీటర్లు కంకరరోడ్డు. బస్‌లు, పాత రైలు ఇంజన్‌లాగా నీటిఆవిరితో నడిచేవి. బస్ లోపల బెంచీలు ఉండేవి. వాటికిపైన సీలింగ్‌కి కర్రలు ఉండేవి. బ్రేకు వేసిన ప్పుడు ఎర్రని దుమ్ము బస్ అంతా అలుముకొని పోయేది. తలవెంట్రుకలు ఎర్రగా అయ్యేవి.

కొండలలో చిట్టడివిలో ఈదర గ్రామమున్నది. అక్కడ దొరికే మధురమైన అడవి తీగపండు, కొండ నక్కేరు కాయలు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఇప్పుడు జీడిపప్పుకు ఎంతవిలువ ఉందో ఆ కొండ నక్కేరుకాయకు అంత విలువ ఉండేది ఆ రోజుల్లో. పండిన పండు దొండకాయ సైజులో ఎరుపురంగులో ఉండేది. మామిడితోటలు విస్తారంగా ఉండేవి. మామిడి పండ్లు కోత అయిన తర్వాత అక్కడక్కడ అడవి తేనెపట్లు బండి చక్రం అంత పెద్దవి కనిపించేవి. ఒక తేనె పట్టును పట్టుకుపోయి అనుభవజ్ఞులు ఒక బిందెడు తేనెను కారుస్తారు. మామిడి చెట్టుక్రింద మామిడాకులు ఎండి రాలి ఉంటాయి. ఆ ఆకులను అక్కడే పోగుచేసి మంట రాకుండా నిప్పుపెడితే విస్తారమైన పొగ ఆకాశంలో లెగుస్తూ దానితో పాటుగా చిన్న తేలు పిల్లంత సైజు ఉన్న తేనెటీగలను ఆకాశం లోనికి తీసుకొని వెళ్తాయి. రాణి ఈగ మాత్రం తేనె పట్టును వదలివెళ్ళదు. ఏ మానవుడు దరి దాపుల్లో మాట్లాడినా ఆ తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేస్తాయి. తేనెటీగల దాడి నుండి తప్పించుకోవడానికి చెరువు లోకి దూకి అవి వెళ్ళిపోయే దాకా ముక్కు మాత్రం నీళ్ళ పైన పెట్టి గాలి పీల్చుకుంటారు. లేకపోతే తేనెటీగల విషం ప్రాణం తీస్తుంది.

సెలవులకి మేము ఒంగోలు నుండి ఈదర వెళ్ళాం. ఒక మామిడి తోటలో నుండి మేము వెళ్తుంటే మా తమ్ముడు పది అడుగుల ఎత్తులో ఉన్న తేనెటీగల తుట్టు చూసి ముందు వెళ్తున్న మా నాయన కృపాదానంగారి వద్దకు వెళ్ళి సైగ చేసి చూపించాడు. మా నాయన వెంటనే కాళ్ళతో క్రింద రాలిన ఆకులను పోగుచేస్తూ మమ్ములను అలా చెయ్య మన్నాడు. నిప్పు తీసుకొనిరాయ్యా అని నన్ను దూరంలో కనపడుతున్న మోటబావి దగ్గరకు వెళ్ళి అగ్గిపెట్టె అడిగి తెమ్మన్నాడు. నేను వెళ్తే అక్కడ నారాయణస్వామి అనే కమ్మ ఆసామి మా నాయనను ఆ తేనె దగ్గర నుండి వెళ్ళిపొమ్మని చెప్పు అని, ఆయనే నాతో వచ్చి పాదిరిగారు ప్రాణాపాయం. దాని దగ్గరకి పోవద్దు అన్నాడు బ్రతిమాలినట్లుగా. ప్రార్థన చేస్తాను పరవాలేదు అని అగ్గిపెట్టె ముట్టించాడు. నారాయణ స్వామిగారు అక్కడ నుండి వెళ్ళిపోతూ మమ్మల్ని కూడా రమ్మన్నాడు. మేము కొంచెం దూరం వెళ్ళి కూర్చుని చూస్తున్నాం. కొంచెంసేపటికి పెద్ద పొగ ఆకాశానికి లేచింది. ఈగలు ఎగిరిపోయినవి. రాణి ఈగకు తోడుగా ఉన్న ఈగల ను చేత్తో ప్రక్కకు నెట్టినప్పుడు సన్నధారగా తేనె నేలకు దారిపట్టింది. నేను మోటబావి వద్దకు వెళ్ళి వాళ్ళని అడిగి మట్టికుండ ఒకటి తెచ్చాను. తేనె ధార క్రింద ఆ కుండ పెడితే నిండింది. దానిని ఎత్తుకొని బావి వద్దకు వచ్చాము. చుట్టుప్రక్కల అక్కడి వాళ్ళు ఒకరిద్దరు కడవలు తీసుకొని వచ్చి తేనె పట్టుకొన్నారు. ఇంటికి మేము వచ్చినప్పుడు మా అమ్మ సంగతి విని, ఆ తేనెటీగలు ఎంత ప్రమాదకరంగా ప్రాణాలు తీస్తాయో చెబుతూ ఏడ్వటం మొదలుపెట్టింది. ప్రభువు తన సేవకులను కాపాడు కుంటాడు. ఆయన మనకు చూపించిన ఆహారాన్ని వదిలిపెడతామా? అన్నాడు నాన్న. ఆ గ్రామంలో కృపాదానం పాదిరి తేనెపట్టును కొట్టారని చెప్పుకున్నారు.

1953వ సంవత్సరములో కృపాదానంగారు

రామాయపట్నం బాప్టిస్టు థియోలాజికల్ సెమినరీలో బి.టిహెచ్. ఇంగ్లీషు కోర్సు తన పెద్ద కుమార్తె రత్న కుమారితో కలిసి చదివినారు. ఆయన భార్య హన్నమ్మ గారు తెలుగు కోర్సు చదివినారు. ఆ కోర్సులో భాగంగా ఎండాకాలం సెలవుల్లో ఆత్మకూరు ఫీల్డులో సువార్త సేవ చేయుటకు ఆత్మకూరులోని మిషనరీ బంగళాలో కాపురం పెట్టారు. 1954వ సంవత్సరం జూన్ నెలలో ఒక గ్రామంలో రాత్రి ప్రార్థన జరిపించి నాటి సువార్తికులను ఆ గ్రామములో వదలి, ఒంటరిగా ఆత్మకూరు రావటానికి బయలుదేరాడు. తోటి సువార్తికులు అలా వెళ్ళవద్దని బ్రతిమాలారు. ప్రక్క గ్రామంలో దొంగలు ఒంటరిగా వచ్చే వారిని బాధిస్తారని చెప్పినా వినకుండా ఒంటరిగా రాత్రి 9 గంటలకు బయలుదేరారు కృపాదానం.

ఒక కిలో మీటరు నడచిన తర్వాత కరెంటులేని గ్రామంలో నుండి వెళ్ళవలసి వచ్చింది. అక్కడ దూరంగా నలుగురు మనుష్యులు నిలుచుని ఉన్నారు. కృపాదానంగారు పెద్దగా పాట పాడుకుంటూ వారి మధ్యగా నడిచాడు. ఆ నలుగురు మనుష్యులు కృపాదానంగారు మాత్రమే కాకుండా నలుగురు మనుష్యులు వెళ్ళడానికి వీలుగా దారి ఇచ్చారు. రెండవ రోజు మరలా అదే దారిన ఒంటరిగా నడుస్తున్న కృపాదానం గారిని ఆ ముగ్గురు మనుష్యులు ఆపి. నిన్న మీతో వచ్చిన మీ పాస్టర్లు ఇప్పుడు రాలేదా అని అడిగారు. కృపాదానం గారికి అర్ధమయింది నిన్న నాతో వచ్చినవారు ఇప్పుడు కూడా నాతో ఉన్నారు. నిన్న మీకు కనిపించారు. ఈ రోజు మీతో చెప్పడానికి నన్ను ఒంటరిగా పంపారు అన్నాడు. నిన్న మీతో వచ్చినవారు ఇప్పుడు మీతో ఉన్నారా? అన్నాడు మరొకడు. వారు ఎప్పుడూ నాతో ఉంటారు. కీర్తనలు 34:7లో యెహోవాయందు భయభక్తులు గలవారి చుట్టు ఆయన దూత కావలి యుండి వారిని రక్షించును అని చెప్పి నడక సాగించాడు. తన యందు ఆసక్తి గలవారితో ఎలప్పుడు దేవుడు ఉంటాడు అని కృపాదానం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడు.

సామర్లకోట నుండి పెద్దాపురం వెళ్ళే బాటలో విట్టికర్ గర్ల్స్ మిషన్ లేడీస్ హాస్టల్, స్కూలు ఉన్నది. రాత్రి 11 గంటలకు మూల తిరుగుడులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ముందు నుండి సైకిల్ మీదుగా వస్తున్న కృపాదానంను ముగ్గురు దొంగలు అటకాయించారు. కృపాదానం సైకిలు మీద నుండి దిగకుండా వెళ్తుంటే తన నోటిలో నుండి పోలీస్ విజిల్ సౌండ్ పెద్దగా వచ్చింది. దొంగలు వెనక్కి చీకటిలో కలిసిపోయారు. 100 గజాల దూరంలో ఉన్న తన ఇంటికి వచ్చిన కృపాదానం విజిల్ వేసిన పోలీస్ కొరకు చూశాడు. అక్కడ చుట్టుప్రక్కలలో పోలీస్ ఎవరూ లేరు. **( సశేషం)**

---


**(16వ పేజీ తరువాయి...)**

అన్నపానములు ఇచ్చేవారు కాదు. పలు హింసలకు గురి చేసినా, బరబ్బ సువార్త ప్రకటించడం మానలేదు. విసిగి పోయిన సైనికులు బరబ్బ చేతులను రాగిని తొలిచే శాసనాల తో గని గోడకు అంటగొట్టారు. రక్తము కారుతున్నా గనిలో కార్మికులకు వినపడేలా, కాపలా కాస్తున్న సైనికులకు విన పడేలా 'యేసే రక్షకుడు' అని నిరంతరం ఎలుగెత్తి బిగ్గరగా అరిచి చెప్పేవాడు. అది సహించలేని రోమా సైనికుడొకడు బరబ్బ కంఠంలో ఈటెను అందించాడు. "యేసూ వీరిని క్షమించు" అంటూ బరబ్బ కంఠం శాశ్వతంగా మూగ బోయింది. ఈటెబోయిన ఆ గనిలో బరబ్బను ఒంటరిగా వదిలేశారు. యేసును విశ్వసించిన గని కార్మికులు విముక్తి కోసం నిరీక్షిస్తున్నారు. నెగేబ ఎడారిలో ఉధృతమైన సుడి గాలులు చెలరేగాయి. తిమ్నాలోయలో ఇసుక నదులు ప్రవహించాయి. రాగి గనుల ముఖ ద్వారాలు మునిగి పోయాయి. లోపల ఉన్న బరబ్బ ఊపిరి గాలిలో కలిసి పోయింది. ఆ గాలిలో 'బ..ర్..ర్...ర్....ఈ...స్..స్ స్ అనే శబ్దం సుడులు తిరుగుతూ ఆకాశాన్ని అంటింది.

(నోబెల్‌ప్రైజ్ విన్నర్ Par Lager వ్రాసిన బరబ్బ నవల లోని సంఘటనలను , కొన్ని వ్యాసాల, కొందరి ఉపన్యాసాల సారాంశమును, మిళితం చేసి పరిశుద్ధాత్మ ప్రేరణతో ఈ వ్యాసం సంకలనం చేయబడింది..... రచయిత)

# నమ్మితే సమస్తము సాధ్యమే

మనము దేవున్ని నమ్మము. ఇది వాస్తవం. నమ్ము తున్నాము అని చాలా గట్టిగా విశ్వసిస్తాము. కాని అది మన భ్రమ మాత్రమే ఎందుకంటే ఆ నమ్మకం ఎంతవరకు అనేది మనకు తెలియదు. 'నమ్ముట నీ వలననైతే' అని యేసుప్రభువు అన్న మాట అర్థం చేసుకోగలిగితే నమ్మడం అనే ప్రక్రియ చాలా కష్టతరమైనదని అర్థమవుతుంది. 'నమ్ము వానికి సమస్తము సాధ్యమే' అయితే మరి మనం ఏదైనా సాధించుకో లేకపోవడానికి మన నమ్మకమే కారణమవుతుంది కదా! మనకు జరిగే మేలుల విషయంలోనే మనం ఎక్కువగా దేవున్ని నమ్ముతామే తప్ప, మనకు జరిగే కీడుల విషయంలో దేవున్ని నమ్మము. అంటే మనకు కీడు జరిగితే దేవున్ని నిందిస్తాము. దేవుడు చూస్తున్నాడు కదా! ఈ కీడు జరగకుండా దేవుడు ఎందుకు అడ్డుకోలేదు, ఒకవేళ ఇది దేవుని చిత్తమేమో అనుకొనేంత స్థాయికి మనం ఎదగము. ఎందుకంటే మనం దేవుని నుండి కేవలం మేలు మాత్రమే ఆశిస్తాము. *'మనము దేవుని వలన మేలు అనుభవించుదుమా, కీడును మనము అనుభవింప తగదా' (యోబు 2:10)* అని పలికిన యోబు స్థాయికి మనం ఎదగ గలిగిన రోజున మనం దేవున్ని హృదయ పూర్వకంగా నమ్మగలము. యోబు దేవునియందు విశ్వాస ముంచి ఆయనను నమ్ముకొనినప్పటికీ కన్నబిడ్డలను, ఆస్తిని, ఆరోగ్యంతో సహా సర్వం కోల్పోయాడు. అయినప్పటికీ ఆయన దేవుని మీద నమ్మకాన్ని వదలలేదు. యోబు స్థానంలో మనం ఉండి, మనకి అలాంటి పరిస్థితి ఎదురైతే మనం యోబులా ఉండగలమా? ఖచ్చితంగా ఉండలేము. ఎందుకంటే దేవుని నుండి మనం అలాంటి పరిస్థితిని ఊహించలేము. మనం ఎంతసేపటికీ దేవుడు మనకి డబ్బు ఇవ్వాలి, ఉద్యోగం ఇవ్వాలి, మంచి జీవిత భాగ స్వామిని ఇవ్వాలి. రోగాలు రాకుండా కాపాడాలని ఇలా మనకి అనుకూలంగా దేవుడు చెయ్యాలని కోరుకుంటాము. దావీదు మహారాజు తన రాజ్యమును వదలి పారిపోయి కొండలలో తలదాచు కున్నప్పుడు షిమీ అను ఒకడు దావీదును శపిస్తుంటే, అప్పుడు అబీషై దావీదుతో, ఈ చచ్చిన కుక్క నిన్ను శపించటమా, వాని తల ఛేదిస్తాను అని అంటాడు. అప్పుడు దావీదు అబీషైతో –యెహోవా వానికి సెలవిచ్చాడు, వానిని శపింపనియ్యుడు అని చెప్తాడు. దావీదు తన జీవిత కాలంలో ఎదుర్కొన్న సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తి దేవున్ని నమ్మడం ద్వారానే పొంద గలిగాడు. దావీదు హృదయపూర్వకంగా దేవుని నమ్మి ఆయన మీదనే ఆధారపడ్డాడు కాబట్టే దేవుడు దావీదును నా హృదయాను సారుడు అని పిలిచాడు. మన స్థితినిబట్టి దేవునిపై మన నమ్మకం ఆధారపడి ఉండకూడదు. మనం ఏ స్థితిలో ఉన్నప్పటికీ దేవున్ని నమ్మి, ఆయనయందలి విశ్వాసంతో ఆయన మీద ఆధాపడినప్పుడు మనకు అసాధ్యమైనది ఏదీ ఉండదు. అసాధ్యమైనది అంటే ఈ లోకంలో మనం అనుభవించే లోకభోగాల విషయంలో కాదు గాని, ఈ లోకంలో మనకు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనుటకు మనకు సాధ్యమవు తుంది. మనం దేవున్ని ఎలా నమ్ముతున్నాము. మేలు వరకేనా, కీడులో కూడానా. అదంతా మనం నమ్మటంలోనే ఉంది. ఒకవేళ యోబులా నీకు కీడు జరిగినప్పటికీ 'దేవుని వలన మనము కీడును అనుభవింప తగదా' అనే స్థాయిని సంపా దించుకోడానికి సిద్ధంగా ఉన్నావా?



పాఠకులకు, చందాదారులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు

**పునరుత్థాన పండుగ శుభాకాంక్షలు**

– ఎడిటర్ మరియు సిబ్బంది

# దేవుడు - సిరి

జాగ్రత్త పడుడి! అని యేసుప్రభువు చెప్పాడు. జాగ్రత్త పడుడి అంటే అపాయము పొంచి వున్నది అని హెచ్చరిక. యేసుప్రభువు ఈ విషయం చెప్పినప్పుడు, ఒక వ్యక్తి వచ్చి తన సహోదరుడు పిత్రార్జితములో తనకు రావలసిన భాగమును ఇవ్వడం లేదని చెబుతున్నాడు. ఇందులో దేవుని కేమి సంబంధం లేదు. కనీసం ప్రభువు అతని ఓదార్చినట్లుగా కూడా కనబడటం లేదు. పైగా మీకు తీర్పు తీర్చటానికి నన్నెవరు నియమించారు? అంటున్నాడు. ఆ వ్యక్తి ఆస్థికోసం ఎంతమంది చుట్టూ తిరిగాడో ఎన్ని అవస్థలు పడ్డాడో, చివరికి యేసుప్రభువుకు చెబితే ఆయన సహాయం చేస్తాడని అనుకున్నాడు. ఆస్థిలో భాగం, ఆస్థి కొరకు పోరాటం ఈ విషయాలు వినటానికి కూడా ప్రభువుకు ఇష్టంలేనట్లుగా ఉంది. తన మాట వినేవారు, తను చెప్పినట్లుగా జీవించాలి అనుకొనే వారందరి కొరకు యేసు మీరు ఏ విధమైన లోభమునకు చోటివ్వకుండా జాగ్రత్త పడుడి అంటున్నాడు. తన దగ్గరకు వచ్చిన వ్యక్తికి ఆకలిగా లేదు. అతడు అన్ని విషయాలలో కలిగి వున్నవాడైనను తనకు తండ్రి వలన వచ్చే ఆస్థి కావాలి.

ఈ లోకములో ఎవరైనా నీకు అన్యాయము చేస్తే అంటే నీ మీద వ్యాజ్యము వేసి నీ అంగీని తీసుకొన గోరిన యెడల వానికి నీ పైవస్త్రమును కూడా ఇచ్చివేయుము అని మత్తయి వ్రాస్తే, నీ పైబట్ట ఎత్తుకొని పోవు వానికి నీ అంగీని కూడా ఎత్తుకొనిపోకుండా అడ్డగించకుము అని లూకాలో వ్రాయ బడింది. నిన్ను అడుగు ప్రతివానికి ఇమ్ము. నీ సొమ్ము ఎత్తుకొని పోవు వానియొద్ద దాని మరల అడుగవద్దు. ఈ మాటలు నీ తమ్మునికో, నీ అన్నకో, నీ తండ్రికో, నీ పొరుగు వానికో చెబితే నీకు పిచ్చిపట్టింది అని అంటారు. యేసు ప్రభువును తన సొంతవాళ్ళే ఆ మాట అన్నారు (మార్కు 3:21). ఈ మాటలు మనలను ఆచరించమని యేసుప్రభువు చెప్పాడు. యేసు మాటలను మనం మన జీవితంలో నెరవేర్చ పూనుకుంటే మనం ధనము, ఆస్థి కూర్చుకోవటం మానివేస్తాం, దాని విషయం ఆలోచించము.

నిన్ను అడుగు ప్రతివానికి ఇమ్ము, నీకు మరల తిరిగి ఇస్తాడని కాదు. యేసు చెప్పాడు కనుక యేసుకు ఇస్తున్నా మని గ్రహించాలి. అణచి కుదిలించి దిగజారునట్లు ఆయన మనకు తిరిగి ఇస్తాడు. ఇది ఆయన వాగ్ధానము.

ఒక ధనవంతునికి భూమి సమృద్ధిగా పండిందంటే అది వాని మహత్యం కాదు. అతను నేలలో పెట్టిన గింజను ముప్పదంతలుగాను, అరువదంతలుగాను, నూరంతలు గాను ఫలింపజేసింది ప్రభువే. మనం సమృద్ధి కలిగి ఉన్నామంటే అది మన కష్టం, మన తెలివి, మన జ్ఞానము వలన కాదు. ప్రభువు ఇచ్చాడు. కాబట్టి ప్రభువు చెప్పిన విధముగా చెయ్యాలి. అలా కాకుండా ఇదంతా నాకు, నా కుటుంబానికి దేవుడిచ్చాడు, ఇంట్లోకి నేనేమి తేవాలి? కొత్త ఇల్లు కట్టించుకోవాలి అని సొంత పనులను గూర్చి ఆలోచించకూడదు. యేసు ఐదు రొట్టెలను రెండు చేపలను పట్టుకొని ఆకాశము వైపు కన్నులెత్తి ఆశీర్వదించి, ఆ రొట్టెలను విరచి, అందరికి వడ్డించుటకు తన శిష్యుల చేతికిచ్చాడు. మనకు దేవుడు సమృద్ధిగా ఇచ్చేది, ఇతరులకు పంచటానికి. మన ఇంటికి వచ్చిన వారికి ఇవ్వటానికి దేవుడు మనకు కొంత ఇస్తే అది నాది, నా కుటుంబానిది అని, వచ్చిన వారిని చూసి విసుక్కొని రేపటి కొరకు డబ్బు దాచుకుంటున్న నీకు ఆ రేపు లేకపోతే... దేవుడు మనలను చూచి వెర్రివాడా... ఈ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నారు అంటున్నాడు. అంటే రేపు దేవునిది. కాబటి దేవుని నమ్మి ఆయనపై ఆనుకొని దేవుడు నీకిచ్చిన తలాంతులను వాడు. భూమి(బ్యాంకు)లో దాచుకోవద్దు. ప్రభువు మనకు డబ్బులు ఇవ్వాలని సమృద్ధిగా ఇవ్వాలని కోరుకుంటాము, ప్రార్థిస్తుం టాము. కాని ఆయన ఇచ్చిన దానిని ఆయన చెప్పిన రీతిలో కాపాడుకొనమంటే అది పద్ధతి కాదు.

## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF HANNA KRUPA MONTHLY

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : ONGOLE |
| 2. | Periodicity of its Publication | : Monthly |
| 3. | Printer's Name | : K. E. Rajendra |
| | (Whether Citizen of India) | : Indian |
| | Country of Origion/Address | : 5th Lane, Cloughpet, Ongole - 523 001 |
| 4. | Publisher's Name | : K. Emmanial Rajendra |
| | (Whether Citizen of India) | : Indian |
| | Country of Origion/Address | : Krupadanam Street, Cloughpet, Ongole - 523 001 |
| 5. | Editor's Name | : K. Emmanial Rajendra |
| | (Whether Citizen of India) | : Indian |
| | Country of Origion/Address | : Krupadanam Street, Cloughpet, Ongole - 523 001 |

I, K. Emmanial Rajendra here by declares that the particulars given above are true to the best of my knowledge and belief.


Date : 18-03-2023

(Sd.) ***K. Emmanial Rajendra***
Signature of the Publisher


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు–ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి... **www.onlinetelugubible.net**

**www.onlinetelugubible.net**



# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 9

**అడ్డం :**

1.---(2) ద్వారాను రక్తము ద్వారాను వచ్చిన వాడు ఈయనే అనగా యేసుక్రీస్తు (1 యోహాను)

3.మీరు మీ --- (2) కారు విలువపెట్టి కొనబడినవారు (1కొరింథి) (తిరగబడింది)

5. ఒత్తు మరచిన మరచుట అను అర్ధమిచ్చు యోసేపు కుమారుడు(3) (ఆది)

7. జనులు తన ----(4) చూతురేమో అని మెలకువగా ఉండి తన వస్త్రమును కాపాడుకొనువాడు ధన్యుడు (ప్రకటన) (తిరగబడింది)

8. నెబుకద్నెజరు రాజ్యం (4) (దానియేలు)

9. వారు రమ్యమైన ---- (3) ను నిరాకరించిరి (కీర్తనలు) (తిరగబడింది)

10. యెహోవా ----(3) హస్తము సాహస కార్యములు చేయును (కీర్తన)

11. ఇది క్రీస్తు పూర్వ కాదు. క్రీస్తు ---(3)

13. భూమియు దాని, సంపూర్ణతయు లోకమును దానిలో---- దంతయు వినును గాక (3) (యెషయా) (తిరగబడింది)

15. కనాను పంచి పెట్టు ప్రధానులలో షిమ్యోను గోత్రికుడు (4) (సంఖ్యా)

16. నాబాలు --- వలె బిగుసుకొనిపోయెను (2) (1సమూ)

17. (మకరము) దాని తలనిండ --- అలుగులు గుచ్చగలవా? (2) (యెబు)

18. ధరణీలోని ధనములెల్ల ---(3) పాలైపోవును (తారుమారు)

20. ప్రతివానికిని తగిన --- దేవుని వలన కలుగును (2) (1కొరింథీ)

21. తిరగబడిన గెయువేలు తండ్రి (2) ( సంఖ్యా)

**నిలువు :**

1. వరసగ 10 వచనాలు ఈ పదంతో మొదలవుతాయి (4) (యిర్మీయా)

2. గెరాసేనుల దేశంలో దయ్యం పట్టిన వాని పేరు (2) (లూకా)

4. జ్ఞాని, సామెతల గ్రంథ కర్త. కాస్త దారి తప్పాడు (4) (సామెతలు)

5. యెహోవా మోషేతో చూడుము నీ ---- (5) సమీపించెను (ద్వితీయో) (తారుమారు)

6. గూడార్థము గల మాటలతో సొలొమోనును శోధించుటకై వచ్చిన రాణి (7) (1 రాజులు)

12.భూమి మీద అందరి కంటే అత్యధిక కాలం బ్రతికినవాడు శీర్షాసనమేసాడు (4) (ఆది)

14.---- ద్రావకము చేత నన్ను మత్తునిగా చేసెను (4) (విలాప) (తిరగబడింది)

19. ధనవంతులకు తమ --- సమృద్ధి చేత నిద్ర పట్టదు (2) (ప్రసంగి)